వీడిన హత్య కేసు మిస్టరీ



నవతెలంగాణ-సిద్దిపేట : సిద్దిపేట పట్టణంలో గురువారం కలకలం సృష్టించిన హత్య కేసు మిస్టరీని చేదించి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపి మధు తెలిపారు. పట్టణంలోని ఏసీపీ ఆఫీస్‌లో ఆయన కేసు వివరాలను శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. కరీంనగర్ పట్టణం రేకుర్తి గ్రామానికి చెందిన పర్వతం రాజు కేసీఆర్ నగర్ కాలనికి చెందిన బోదాసు శ్రీనివాసులు స్నేహితులు. కాగా రాజు గత కొంతకాలంగా తన బార్య పిల్లతో దూరంగా ఉంటున్నాడని, ఈ క్రమంలో 19వ తేదీన సిద్దిపేటకు వచ్చిన నిందితుడికి శ్రీనివాస్ కనిపించగా అతనిని నర్సాపూర్ చౌరస్తాలో ఉన్న నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగులోకి తీసుకొని వెళ్లి శ్రీనివాస్ కు బాగా మద్యం తాగించి అతను తాగి పడిపోగానే, ఆతనితో హెూమో సెక్స్ చేస్తుండగా, శ్రీనివాస్‌కి మేలుకువ వచ్చి, ప్రతిఘటించాడు. దీంతో శ్రీనివాస్‌ను రాజు కర్రతో కొట్టి చంపి, తర్వాత అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. శుక్రవారం టూ టౌన్ సీఐ ఉపేందర్ తన సిబ్బందితో కలిసి నిందితుడిని పట్టుకొని విచారించి, అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

సీఎం అనుచరగణంగా మారిన పోలీసులు

మీడియాపై దౌర్జన్యాన్ని ఖండించిన మాజీ మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ-సిద్ధిపేట : మీడియా స్వేచ్ఛను అణగదొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన కొనసాగిస్తోందనీ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఎక్స్ వేదికగా ఖండించారు. టీఎస్24 న్యూస్ కార్యాలయంపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండించారు. మహిళా జర్నలిస్టుపై అనుచితంగా ప్రవర్తించిన ఘటన ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ఉందన్నారు. అధికార బలంతో పోలీసులను మీడియాపై ఉసిగొల్పడం గర్హనీయమైన చర్య అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టుపై అక్కసుతో పోలీసులు ఓవర్ యాక్షన్ చేయడం, సీసీ కెమెరా డేటాను స్వాధీనం చేసుకోవడం మీడియా స్వేచ్ఛను కాలరాయడమేనన్నారు. ఇది సీఎం రేవంత్ రెడ్డి నిరంకుశ, నియంతృత్వ పాలనలో జర్నలిస్టులకు దక్కుతున్న గౌరవమని హరీశ్‌రావు పేర్కొన్నారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు, పోస్టులు పెడితే భౌతిక దాడులు! ఇదేనా మీరు చెప్పిన సో కాల్డ్ ప్రజాపాలన? ఇందిరమ్మ రాజ్యమని కాంగ్రెస్ ఎమర్జెన్సీ పాలనను గుర్తుచేస్తున్నారనీ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాజీ మంతిత్రి హరీశ్‌రావు ఎక్స్‌లో ట్విట్. చేశారు.

నాణ్యత పాటించని దాబా, స్వీట్ హౌస్ సీజ్

నవతెలంగాణ-ఝరాసంగం



మండల కేంద్రమైన ఝరాసంగం లోని ఓ స్వీట్ హౌస్, సంగం (కె) గ్రామ శివారులో గల మిలాన్ దాబాను జిల్లా పుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్, స్థానిక తహసిల్దార్ తిరుమలరావులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేశారు. ఆహారంలో నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడం వల్లే వాటిని సీజ్ చేయడం జరిగిందన్నారు. హెూటల్, స్వీట్ దుకాణాల యజమానులు శుభ్రత పాటించకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మహాశివరాత్రి జాతర ఉత్సవాల్లో ఏర్పాటు చేసే దుకాణాదారులు తప్పని సరిగా తినుబండారాల తయారీలో నాణ్యత పాటించాలన్నారు.

అక్రమ మొరం తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-న్యాల్‌కల్

అక్రమ మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ భూపాల్ హెచ్చరించారు. డప్పూర్ గ్రామంలోని అసైన్మెంట్ భూముల్లో శుక్రవారం అక్రమంగా మొరం తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో.. గిర్దవర్ శ్యామ్‌రావు, సిబ్బందితో కలిసి దాడులు జరిపారు. మట్టి తవ్వకాలు చేస్తున్న హిటాచిని సీజ్ చేసి రూ.30వేల జరిమానా విధించారు.

ఘనంగా కాట సుధారాణి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అమీన్‌పూర్

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు, అమీన్‌పూర్ 15 వార్డు మాజీ కౌన్సిలర్ కాటా సుధారాణి జన్మదినం సందర్భంగా పుర ప్రముఖులు వారి నివాసానికి వచ్చి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.శశిధర్‌రెడ్డి కాటా సుధారాణిని శాలువాతో సత్కరించి పూలబొకేని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మున్నా, బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం ఛైర్మన్ బి. సుధాకర్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు మల్లేష్, లక్ష్మీకాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

కల్హేర్‌కు చేరిన నూతన 108 అంబులెన్స్

నవతెలంగాణ-కల్హేర్



రాష్ట్ర ప్రభుత్వం నూతన 108 అంబులెన్స్‌లను రాష్ట్రంలోని అన్ని జిలాలకు ఇటీవలే అందజేసింది. అందులో భాగంగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కల్హేర్ మండలానికి నూతన 108 అంబులెన్స్ కేటాయిం చారని.. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నారాయణ, ఇంతియాజ్, పైలెట్ సత్యం, సంజీవ్‌లు తెలిపారు. ఈ క్రమంలో మండల కేంద్రానికి వచ్చిన నూతన 108 అంబులెన్స్‌కు శుక్రవారం పూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుమూల వెనుకబడిన ప్రాంతమైన కల్హేర్ మండల పరిధిలోని ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు అత్యవసర పరిస్థితుల్లో 108ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 108 అంబులెన్స్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీలు ఇంతియాజ్, నారాయణ, పైలట్ లు సత్యం, సంజీవ్, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నరేందర్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలి



నవతెలంగాణ-జోగిపేట

కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మెన్ జగన్మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎస్. సురేందర్ గౌడ్‌లు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం పట్టణ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శివరాజ్, మాజీ ఎంపీటీసీ డీజీ. వెంకటేశం, మాజీ కౌన్సిలర్స్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్, డాకూరి శంకర్ , రంగ సురేష్, కోరబోయిన నాగరాజ్, దుర్గేశ్, చందర్,హరికృష్ణ, ప్రదీప్ గౌడ్, శరత్ బాబు, కో ఆప్షన్ మెంబర్ అల్లే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇండ్లకు భూమి పూజ

నవతెలంగాణ-ఝరాసంగం



మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇండ్ల నిర్మాణానికి తహసీల్దార్ తిరుమలరావు, మండల అభివృద్ధి అధికారి సుధాకర్‌లు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. అందుకు ముందుగా కేటాయించిన స్థలంలో హౌసింగ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ మాధవరెడ్డి ముగ్గును గీసి పలు రకాల చెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిలో నైపుణ్యాన్ని పెంపొందించేలా శిక్షణ


నవతెలంగాణ-జహీరాబాద్



ఆర్టీసీ సిబ్బందిలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణ ఇచ్చినట్టు రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. శిక్షణ పొందిన సిబ్బందిని డిపో ఆవర ణలో శుక్రవారం ప్రశంసించారు. అనంతరం జహీరా బాద్ ఆర్టీసీ డిపోలో శిక్షణ కేంద్రాన్ని సందర్శించి ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎం డీ సజ్జనర్ ఆదేశాలతో జహీరాబాద్ డిపోలో 18.02.2025 నుంచి పలువురు సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు.ప్రయాణికులతో ఎలా నడుచుకోవాలి, ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఎలాం టి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలు.. శిక్షణ తరగతుల ఆవశ్యకతను సిబ్బందికి వివరించారు. అత్యు త్తమ ప్రదర్శన కలిగిన ఉద్యోగస్తులకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, గ్యారేజ్ ఇంచార్జ్ తిరుమలేష్ పాల్గొన్నారు.

విద్యాపీఠం కృషి అభినందనీయం

నవతెలంగాణ-సంగారెడ్డి



ఆధ్యాత్మిక ధార్మిక సేవా కార్యక్రమాల్లో శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ హెూం శాఖ మంత్రి జానారెడ్డి అన్నారు. సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్మిస్తున్న 1.08 కోటి రుద్రాక్షల శివలింగాన్ని శుక్రవారం సందర్శించారు. ప్రపంచంలోనే మొదటిసారిగా రుద్రాక్షలతో శివలింగాన్ని ఇక్కడే తయారు చేస్తున్నామని విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి జానారెడ్డికి వివరించారు. గతంలో భస్మ లింగం, పత్ర లింగాలను కూడా మహాశివరాత్రికి తయారు చేసినట్లు సిద్ధాంతి వివరించారు. ఆశ్రమంలో కైలాస ప్రస్తార మహామీరు పంచముఖ ఉమామహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. ప్రకృతి నుంచి వచ్చిన వస్తువులు మాత్రమే ఆలయంలో వాడుతు న్నామన్నారు. చిన్న వయసులోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జానారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్ తోపాజి అనంత కిషన్, విద్యాపీఠం సభ్యులు ప్రశాంత్ కుమార్, దారం సంజయ్, విట్టల్ దాస్, రాజేంద్ర మహేందర్, భైరవ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

నవతెలంగాణ-సంగారెడ్డి



నిజామాబాద్ కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల తో కూడిన కరీంనగర్ శాసనమండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సంగారెడ్డి జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి వల్లూరు వెల్లడించారు. హైదరాబాద్ నుం చి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్రాంతి వల్లూ రు, అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, అదన పు ఎస్పీ సంజీవ్ రావులతో తదితరులు ఐసీసీ జిల్లా సము దాయాల కార్యాల యం వీ.సీ హాల్ నుంచి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్సుల తరలింపు, పోస్టల్ బ్యాలెట్, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పోలీసు బందోబస్తు, ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత జిల్లాల కలెక్టర్లకు కీలక సూచనలు చేశారు. వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులతో మాట్లాడుతూ.. ఈ.సీ మార్గదర్శ కాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు కట్టుది ట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సదుపాయాలను సరిచూసుకోవాలన్నారు. షామి యానాలు, తాగునీరు, వీల్‌చైర్ వంటి వసతులతో పాటు, ప్రతి పోలింగ్ స్టేషన్లో వైద్య సిబ్బం దిని అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ ఏర్పాట్లపై చేపట్టిన చర్యల గురించి రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, సైలెన్స్ పీరియడ్‌లో పాటించా ల్సిన నిబంధనలు అమలయ్యేలా చూడాలన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కట్టుది ట్టంగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచిం చారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్‌కు తరలించాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు దెబ్బతినకుండా అవస రమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్సులను, మెటీరియల్ ను పీఓ, ఏపీఓలు తమ వెంట కరీంనగర్ రిసెప్షన్ సెంటర్‌కు చేర్చాల్సి ఉంటుందని, వారితో పాటు సూక్ష్మ పరిశీల కులు కూడా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయా లని, పోలీసు బందోబస్తు మధ్యన వాటిని తరలించాలని, సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ జరపాలని, ఆయా పోలి ంగ్ కేంద్రాలలో కొనసాగే ఓటింగ్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని అన్నారు. పోలింగ్ ముగిసిన మీదట సాధ్యమైనంత త్వరగా బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్ కు చేర్చేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయా లన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ పద్మజ రాణి, జడ్పీసీ ఈఓ జానకిరెడ్డి, సీపీఓ బాలశౌరి, ఈడీఎస్‌సీ కార్పోరేషన్ రామాచారి, ఆర్డీఓలు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడింది పాత నేరస్తుడే, రిమాండ్‌కు తరలింపు

సీఐ క్రాంతి కుమార్

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో సంచలనం రేపిన మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో పోలీసులు నిందితుడిని పట్టుకొని అతడు పాత నేరస్తుడిగా గుర్తించారు. సంగారెడ్డి సీఐ తెలిపిన వివరాలు ప్రకారం సదాశివపేట పట్టణానికి చెందిన వ్యక్తి గతంలో పలు దొంగతనాలు, ఒక రేప్ కేసులో నిందితుడు. సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధితోపాటు బోరబండ, బీడీఎల్ భానూర్ స్టేషన్ల పరిధిలో మొత్తం నాలుగు కేసులు ఉన్నాయి. ఆ కేసుల్లో జైలుకు వెళ్లి కూడా వచ్చాడు. అయితే కొద్ది రోజులుగా సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్‌లో నివాసం ఉంటున్న అతడి అక్క, బావ వద్ద చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఉంటున్నాడు. కాగా ఈ నెల 20న రాత్రి సమయంలో ఓ 8 ఏళ్ల మైనర్ బాలికలకు మాయ మాటలు చెప్పి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ క్రాంతి కుమార్ తెలిపారు.

హెటెరో పరిశ్రమలో అకస్మాత్తుగా మంటలు

ముగ్గురు కార్మికులకు గాయాలు

ఆసుపత్రికి తరలింపు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



కాజిపల్లి పారిశ్రామికవాడలోని హెటెరో డ్రగ్స్ యూనిట్-1లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడగా.. వెంటనే ఆసుపత్రికి తరలించారు. బొల్లారం సీఐ ఎం.రవిందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పరిశ్రమలో గురువారం సాయంత్రం డ్రయ్యర్ వద్ద ఇంటర్మీడియట్ ఫౌడర్ అన్ లోడింగ్ చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. దాంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు వెంకటరెడ్డి, శేషకుమార్ (బీహార్), శైలేంద్ర ప్రసాద్ (బీహార్)కు గాయాలయ్యాయి. వెంటనే వారిని సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్స్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

తరచూ ప్రమాదాలు..

సంబంధిత అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడంతో.. కాజిపల్లిలోని హెటిరో డ్రగ్స్ యూనిట్-1 పరిశ్రమలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపి స్తున్నారు. సదరు పరిశ్రమ యాజమాన్యం ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ.. కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించడం లేదని మండిపడుతున్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు పరిశ్రమ యాజమాన్యాలకు తొత్తుగా మారి భద్రత పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిశ్రమపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని.. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య చికిత్సలు, నష్టపరిహారం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధిలో ఆర్గానిక్ కెమిస్ట్రీ పాత్రపై చర్చాగోష్ఠి

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'వైద్య పదార్థాలు: సేంద్రీయ రసాయన శాస్త్ర పాత్ర' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన చర్చాగోష్ఠిలో దేశ, విదేశీ ప్రముఖ వక్తలు పాల్గొ న్నారు. వారకా సైంటిఫిక్స్ సహ-సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, స్విట్జర్లాండ్ లోని జెనీవా విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ జెరోమ్ లాకోర్‌బీ డీఎస్టీ-సెర్బ్ పూర్వ కార్యదర్శి, జేసీ బోస్ నేషనల్ ఫెలో డాక్టర్ ఎస్. చంద్రశేఖర్‌బీ మోరెపెన్ ప్రొప్రైటరీ డ్రగ్ రీసెర్చ్ ప్రధాన శాస్త్ర వేత్త డాక్టర్ ప్రదీప్ కుమార్ సస్మల్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ ఔషధ పురోగతికి పునాదిగా ఎలా పనిచేస్తుందనే దానిపై వారు లోతైన అవగాహనను కల్పించారు. వైద్యంలో ఆర్గానిక్ కెమిస్ట్రీ ప్రాథమిక పాత్రను, కొత్త ఔషధాలను రూపొందించడంలో, సంశ్లేషణ చేయడంలో దాని ప్రాము ఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఔషధ సమ్మేళనాలలో అధిక భాగం ప్రకృతిలో సేంద్రీయంగా ఉన్నాయని, శాస్త్రవేత్తలు లక్ష్య చికిత్సా ప్రభావాలను సాధించడానికి పరమాణు నిర్మాణాలను చక్కగా ట్యూన్ చేయడానికి వీలు కల్పిస్తుందని వారు స్పష్టీకరించారు. రసాయన నిర్మాణం, జీవ కార్యకలాపాల మధ్య సంక్లిష్ట సంబంధాన్ని కూడా పరిశీలించడంతో పాటు, ఈ అవగాహన వివిధ వ్యాధులకు వినూత్న ఔషధాల అభివృద్ధిని ఎలా సాధ్యం చేస్తుందో విశదీకరించారు. ఔషధ ఆవిష్కరణలో సేంద్రీయ రసా యన శాస్త్రం అనివార్య పాత్ర ఈ చర్చాగోష్ఠిలోని ఒక ముఖ్యమైన విషయం. ఔషధ ఆవిష్కరణను నడిపించే అధునాతన సింథటిక్ పద్ధతులపై నిపుణులు వివరించారు. రెట్రోసింథటిక్ విశ్లేషణ వంటి పద్ధతులు సేంద్రీయ రసాయన శాస్త్రవేత్తలకు జీవ లక్ష్యాలతో సమర్థవంతంగా సంకర్షణ చెందే నూతన అణువులను రూపొందించడానికి, సంశ్లేషణ చేయడానికి తోడ్పడడంతో పాటు, సంచనాత్మక ఔషధాల సృష్టికి దారితీస్తాయన్నారు. అంతే కాకుండా, సేంద్రీయ రసాయన శాస్త్రం ఔషధ శాస్త్రానికి వెన్నెముక అని, ఇది ఔషధ సంశ్లేషణ, సూత్రీకరణ, డెలివరీని ప్రభావితం చేస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. సేంద్రీయ అణువుల సంక్లిష్టతలను, వాటి ప్రతిచర్యాత్మకతను అర్థం చేసుకోవడం ద్వారా, పరిశోధకులు బాధలను తగ్గించే, జీవిన నాణ్యతను పెంచే ప్రాణాలను రక్షించే మందులను అభివృద్ధి చేస్తూనే ఉన్నట్టు వారు తెలిపారు. వైద్య పురోగతికి మూలస్తంగా సేంద్రీయ రసాయన శాస్త్రం ప్రాముఖ్యతను ఈ చర్చాగోష్ఠి పునరుద్ఘాటించింది. ఇది ఆరోగ్య సంరక్షణలో భవిష్యత్ పురోగతులకు మార్గం సుగమం చేస్తుందన్నారు. తొలుత, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా అతిథులను స్వాగతించి, సత్కరించారు. కార్యక్రమ సమన్వయకర్తలు డాక్టర్ రాంబాబు గుండ్ల, డాక్టర్ పూర్ణచంద్రరావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, వక్తలకు, ఆర్థిక సౌజన్యం అందించిన స్పాన్సర్ల కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఒకే గ్రామం వద్ద వేర్వేరు ప్రమాదాలు

ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ-జోగిపేట



ఒకే గ్రామం.. ప్రధాన రహదారికి ఇరువైపులా జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అందోల్ మండలం అల్మాయిపేట గ్రామ ప్రధాన రహదారిపై దౌల్తాబాద్ మండలం నవాపేట గ్రామానికి చెందిన మల్లేశం, ఎల్లమ్మ దంపతులు గ్రామ బస్టాండ్ నుంచి జోగిపేట వచ్చేందుకు రోడ్డు మధ్యలో పోసిన మట్టి రోడ్డు మీద నుంచి అవతలికి స్కూటీపై దాటుతున్నారు. ఈ క్రమంలో జోగిపేట నుంచి సంగారెడ్డి వెళ్తున్న కారు వారి స్కూటీని ఢీకొట్టింది. దాంతో స్కూటీపై ఉన్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఢీకొట్టిన కారును పోలీసులు గుర్తించారు. అదే సమయంలో మరోవైపు ప్రమాదం జరిగింది. సంగారెడ్డి నుంచి జోగిపేట వైపు దుర్గేష్ అనే యువకుడు బైక్ పై వస్తుండగా వెనకాల నుంచి అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న అతను కొద్ది దూరం వరకు వెళ్లి కిందపడ్డాడు. అవతలి వైపు జరిగిన ప్రమాదాన్ని చూస్తూ కారు నడుపుతున్న డ్రైవర్ బైకును ఢీకొట్టునట్టు స్థానికులు తెలిపారు. కింద పడ్డ అతనిని 108 వాహనంలో జోగిపేట ప్రభుత్వా సుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేయించారు. మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. వెంటనే హైవే పోలీసులు కారును వెంబడించిన ప్రయోజనం లేకుండా పోయింది. గ్రే కలర్‌లో ఉన్న షిఫ్ట్ కారు అని స్థానికులు నిర్ధారణకు వచ్చారు. పోలీసులు గుర్తు తెలియని వాహనం కోసం సుల్తాన్పూర్ టోల్ ప్లాజా వద్ద సీసీ కెమెరాలు పరిశీలన చేశారు. విషయం తెలుసుకున్న జోగిపేట ఎస్సై పాండు తన సిబ్బందితో ప్రభుత్వాసుపత్రికి వచ్చి రోగుల పరిస్థితిని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలపై విచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

మనువాద సిద్ధాంత అమలే బీజేపీ లక్ష్యం

మతాల పేరుతో హిందూత్వ ఎజెండాతో పాలన

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి



కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని రద్దుచేసి మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలన్న లక్ష్యంతో మతాల పేరుతో హిందుత్వ ఎజెండాతో పరిపాలన చేయాలని చూస్తోందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. సాయిలు దుయ్యబట్టారు. పార్టీ సంగారెడ్డి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ సర్కార్.. నూతన ఆర్థిక విధానాలను, నయా ఉదార వాద విధానాలను చాలా వేగవంతంగా అమలు చేస్తోందన్నారు. కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతూ అంబానీ, ఆదానీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. ప్రజలపై భారాలు మోపుతూ.. పెట్రోల్, డీజిల్, గ్యాస్ రోజువారిగా వాడుకునే సరుకుల ధరలు విపరీతంగా పెంచి ప్రజలు బతకలేని దుర్భర స్థితిలోకి నెట్టివేస్తున్నదన్నారు. వికసిత్ భారత్ అంటూ అందమైన పదాలు చెబుతూ ప్రజలను సమస్యలను ఊబిలోకి ముంచేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు దోచి పెడుతూ అవినీతి ఆశ్రిత పక్షపాతంతో దేశాన్ని పాలకులు కబలిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ప్రజల మధ్య మతపరమైన విభేదాలు పెంచేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి సమస్యలతో ప్రజలు సతమవుతమవుతుంటే వారి అసంతృప్తి తమకు వ్యతిరేకంగా మారకుండా మతోన్మాదాన్ని, కూలోన్మాదాన్ని రెచ్చగొడుతున్నదన్నారు. సీపీఐ(ఎం) సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం. యాదగిరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని, అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో ఒకటి, రెండు అమలు చేసి మిగితా సమస్యల గురించి మీనమేషాలు లెక్కిస్తూ రైతులు కార్మికులు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో తాత్సారం చేస్తున్నదన్నారు. ఆర్థిక విధానాల్లో మాత్రం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తేడా కనబడటం లేదన్నారు. విద్యార్థి, యువజన, మహిళ, వృత్తిదారులు, వ్యవసాయ కూలీలు, రైతులు, అసంఘటిత రంగ కార్మికుల, మధ్యతరగతి ఉద్యోగుల, మైనార్టీలు అన్ని రంగాల ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజా నిర్వహిస్తామన్నారు సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని.. ఇలా చేస్తే భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వం పైన పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలరాజు, రమాదేవి, రాజు, నర్సింలు, లక్ష్మణ్, లగ్గం దుర్గయ్య, విట్టల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామంలో చిన్నారిపై లైంగికదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి మహబూబ్ ఖాన్ డిమాండ్ చేశారు. దాడికి గురైన ఆ చిన్నారిని సఖీ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పరామర్శించారు. అనంతరం జిల్లా కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి మహబూబ్‌ఖాన్, వినోదలు మాట్లాడుతూ.. ఎనిమిదేండ్ల చిన్నారిపై నిర్దాక్షిణ్యంగా లైంగికదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్కౌంటర్ చేయాలన్నారు. లేనియెడల పార్టీ, మహిళా సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఆర్. లక్ష్మి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు అనురాధ, కాశీనాథ్, నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలి

నవతెలంగాణ-గుమ్మడిదల



ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ పనులను వెంటనే నిలిపివేయాలని స్థానిక రైతులు చేస్తున్న నిరసనలు 17వ రోజుకు చేరాయి. ఈ విషయమై మండల జేఏసీ ఆధ్వర్యంలో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా స్టే లభించింది. ఈ క్రమంలో సంబంధిత రైతులకు జిల్లా రెవెన్యూ సర్వే అధికారులు, వారి భూములను వారికి సర్వే చేసి ఇవ్వాలని సూచించింది. దాంతో జిల్లా కేంద్రం నుంచి సర్వే సిబ్బంది వచ్చి సర్వే నిర్వహించగా.. అక్కడ రైతుల భూములు తప్పా ఎలాంటి ఖాళీ స్థలం లేదని సూచించారు. గతంలో రెవెన్యూ అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చి ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటయ్యేలాగా చేశారని వారిపై మండల జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభు త్వం సమాలోచన చేసి డంపింగ్ యార్డ్ ఏర్పాటును నిలిపివేయాలంటూ సమ్మె నిర్వహించారు. రైతు రాయప్ రెడ్డి మాట్లాడుతూ.. పచ్చని పల్లె వాతావరణన్ని కలుషితం చేయడానికి డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రక్రియ ముందుకు తీసుకు వచ్చారని.. వెంటనే డంపింగ్‌యార్డ్ ఎత్తివేయాలన్నారు. లేనియెడలనిరవధిక సమ్మెలు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

డిప్యూటీ తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్

సర్వే నంబరు 993లో కూల్చివేతలు

నవతెలంగాణ-అమీన్‌పూర్



ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ఉక్కుపాదం మోపుతామని అమీన్‌పూర్ డిప్యూటీ తహసీల్దార్ హరిచంద్రప్రసాద్ హెచ్చరించారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని సర్వే నంబరు 993లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐలు శ్రీమాన్ రాజు, రఘునాథ్ రెడ్డి, రెవెన్యూ సిబ్బందితో కలిసి శుక్రవారం నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు ఎవ్వరూ చేపట్టిన వదిలిపెట్టబోమన్నారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేపట్టి అనవసరంగా నష్టపోవొద్దని సూచించారు. ప్రజలు సైతం అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల అంశాలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠినంగా శిక్షించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సఖి సెంటర్ లో ఉన్న బాధితురలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 సంవత్సరాల పాపను చాక్లెట్ బిస్కెట్లు ఆశ చూపి తీసుకెళ్లి అత్యాచారం చేయడం చాలా దారుణమన్నారు. మానభంగాల నివారణకు వేసిన కేసులను తెలంగాణ కోర్టు పట్టించుకోవడంలేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో , ఆత్మహత్యలు మానభంగాలు పెరిగాయన్నారు. బాధిత చిన్నారితో పాటు ఆమె కుటుంబ సభ్యులు ఒప్పుకుంటే తన గమ్ సిటీలో వారి యోగక్షేమాలు చూసుకుంటానని హామీ ఇచ్చారు అమ్మాయి చదువుకునేందుకు



ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నవతెలంగాణ-మద్దూరు



సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న బాల్యవివాహాన్ని ఐసిడిఎస్, బాల శిశు సంరక్షణ శాఖ, తహసిల్దార్, ఎస్సై, అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మైనర్ బాలిక, వరుడి, తల్లిదండ్రులకు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని సిద్దిపేట జిల్లా సి.డబ్ల్యూ.సి.అధికారుల ముందు హాజరు పరిచారు.

చౌటకూర్‌లో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో క్లియర్ విజన్ కంటి హాస్పిటల్ సంగారెడ్డి వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జాన్ సాయి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చేశామని.. అదేవిధంగా అవసరమైన వారికి ఐ డ్రాప్స్, కంటి అద్దాలు 50శాతం తగ్గింపుతో ఇవ్వడం జరుగుతుందన్నారు. కంటికి సంబంధించిన ఎలాంటి సమస్య ఉన్న తక్కువ ఖర్చుతో కంటి శుక్లాం ఆపరేషన్ లేకుండా తమ ఆసుపత్రిలో చికిత్స చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుష్ప రాజ్‌తో పాటు వారి సిబ్బంది ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు చేశారు. బిపి, షుగర్ పేషెంట్లకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. రెటీనా పరీక్షలు, లేజర్ ట్రీట్మెంట్ ఆపరేషన్ లాంటివి తక్కువ ఖర్చుతో ట్రీట్మెంట్ చేసుకోవాలనుకునే వారు తమ హాస్పిటల్‌ను సంప్రదించాలన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనలో నీలం మధు



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఇస్నాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాధవానంద సరస్వతి హాజరై భక్తులకు ఆశీర్వాదం అందించారు. ఈ సంధర్బంగా నీలం మధు మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడి నుంచి బయట పడటానికి ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. ఆలయాల నిర్మాణానికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, మాజీ సర్పంచ్ గడ్డం బాలమణి, మాజీ ఉపసర్పంచ్ శోభ కృష్ణారెడ్డి, ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షులు మన్నె రాఘవేందర్, ఊళ్ళ శంకర్, పెంటయ్య, యాదగిరి, రవి, రాజు, మణికంత, పాండు, వి నారాయణరెడ్డి, అశోక్, పాండు, సుధాకర్, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా పుష్ప నగేష్



నవతెలంగాణ-రామచంద్రాపురం

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తన మీద నమ్మకంతో స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. గతంలో సైతం స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా పనిచేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానన్నారు. అదే అనుభవంతో ఈసారి తనమీద ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ రామచంద్రాపురం ప్రాంతం అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గురుకులంలో ఖాళీ సీట్లకు రేపే ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని హోతికేలో గల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 23న (ఆదివారం) గురుకుల పాఠశాలలో (బాలికలు) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్/ పరీక్ష చీఫ్ సూపరిండెంట్ ఎ.సురేఖ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు పరీక్ష రోజున ఉదయం 10 గంటల లోపు కేంద్రానికి చేరుకునేలా వారి తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు.

సెయింట్ ఆంథోనీస్‌లో రజతోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో గల సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో 25 వసంతాల రజతోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ ప్రారంభంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫౌండర్ సీఈఓ ఆఫ్ ఈ అభ్యాస్ డాక్టర్ భువనగిరి ఫణి పవన్ శాస్త్రి, సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల అధినేత సాల్మోన్ రెడ్డి, లీడ్ అకాడమిక్ డైరెక్టర్ దినేష్ రెడ్డి, మునిచౌదరి, కుమారి వరలక్ష్మి, ఎక్సెన్స్ అడ్వైజర్ పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ ప్రధానోపాధ్యాయులు ఈ.అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ హెడ్ ఈ.జయబాలరెడ్డి ,పాఠశాల డైరెక్టర్ ఈ.విజయ కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ యల్.ప్రదీప్ కుమార్, సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈ.జ్యోతి రెడ్డి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమం ప్రారంభించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు వివిధ రకాల డ్యాన్స్‌లు చేసి అందరి అలరించారు.

ఆరోగ్యంపై మహిళా సభ్యులకు అవగాహన



నవతెలంగాణ-ఝరాసంగం

నాణ్యమైన ఆహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని.. ఆరోగ్యమే మహాభాగ్యం అని అసిస్టెంట్ ప్రోగ్రాం మేనేజర్ టిక్యా నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య భవనంలో శుక్రవారం గ్రామస్థాయి మహిళా సభ్యులకు ఆరోగ్యమే మహాభాగ్యం, ఆహారంతోనే ఆరోగ్యం, పిల్లల పోషణ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిఆర్‌డివో ఆదేశాల మేరకు మండల సమైక్య ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు మహిళా సభ్యులకు ఆరోగ్యంపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రామస్థాయి వీవో లీడర్లకు వీటికి సంబంధించిన కిట్స్‌ను అందించామన్నారు. పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వలన ముఖ్యంగా మహిళలు, గర్భిణులకు రక్తహీనత సమస్యలు లేకుండా ఉంటుందన్నారు.వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, మల్లేశం, నరసమ్మ, అకౌంటెంట్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఆర్టీసీ బస్సులు సమయ పాలన పాటించాలని, పాత పద్ధతిలో బస్సు నడపాలని శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమంలో భాగంగా డీఎం మల్లేశయ్యకు ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ.. నారాయణఖేడ్ నుంచి జహీరా బాద్ వయా న్యాల్కల్ బస్సులు సమయపాలన పాటించాలని ఆనంద్, ఉమారాణి, శైలజ, అడిగారన్నారు. నారాయణఖేడ్ నుండి నాగూర్ బి బస్సు ఉదయం ఎనిమిది గంటలకు కావాలని రామ, సురేఖ, నాలుగు ఐదు మంది టీచర్లు అడిగారని.. అలాగే నారాయణఖేడ్ నుంచి శ్రీశైలం పర్మెంటు బస్సు నడపాలని, తోట అంజయ్య, శివ కుమార్, డొప్ప రామకృష్ణారెడ్డి, డి మల్లారెడ్డి అడగారన్నారు. నారాయణఖేడ్ నుంచి వట్‌పల్లి, రాయపల్లి మీదుగా లింగంపల్లి వరకు బస్సు కావాలని నరసింహారెడ్డి రామచందర్ రాయిపల్లి కొంతమంది ప్రయాణికులు కోరారని.. అలాగే నారాయణఖేడ్ కంగ్టి తడ్కల్, పిట్లం సర్వీసును నడపాలని, సర్దార్ రాథోడ్ రాములు ఘనపూర్ అడిగారన్నారు. అలాగే నారాయణఖేడ్ వయా బోరంచ, రాయపల్లి, కంకోల్, సదాశివపేట లింగంపల్లి వరకు ఉదయం ఎనిమిది గంటలకు పాత బస్సులు కంటిన్యూ చేయాలని దినకర్ సర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి, ఉపసర్పంచ్ తదితరులు అడిగారన్నారు. పై అధికారులతో చర్చించి.. ఆయా విజ్ఞప్తులపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ గ్రామంలో గల సిద్ధివినాయక ఆలయంలో హుమ్నాపూర్ మాజీ ఎంపీటీసీ బీరదార్ చంద్రన్న పాటిల్ కుమారుడి వివాహం శుక్రవారం జరిగింది. ఈ వేడుకలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు పలువురు నాయకులు భాస్కర్, నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి,అశోక్ పాటిల్, మారుఫ్, చెంగల్ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

శివ స్వాములకు అన్న దానం



నవతెలంగాణ-మనూర్

శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివ స్వాములకు మండలంలోని బాధలగావ్ గ్రామానికి చెందిన అల్లాబకస్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. గత పది సంవత్సరాలు నుండి అన్నదానం పెడుతున్నారు. గతేడాది అల్లాబకష్ పటేల్ గుండెపోటుతో మృతి చెందాడు. కాగా ఆయన బతికి ఉన్నప్పుడు శివస్వాములకు అన్నదానం చేసేవారు. దాంతో ఆయన కొడుకులు కూడా తండ్రి మార్గంలో నడుస్తూ.. శివ స్వాములకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి వెంకట రమణ రెడ్డి, మాజీ సర్పంచ్ వినోద్ కుమార్, వివిధ గ్రామాల శివ స్వాములు పాల్గొన్నారు.

కూచిపూడి డాన్సర్ అవార్డుకు జోగిపేట చిన్నారి

నవతెలంగాణ- జోగిపేట

బెస్ట్ కూచిపూడి డాన్సర్ అవార్డ్‌కు జోగిపేట పట్టణానికి చెందిన చిన్నారి చాపల అనుపమ ఎంపికయింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విసన్ నేషనల్ బుక్ అఫ్ రికార్డ్స్ వారి ద్వార అనుపమ ఉత్తమ కూచిపూడి అవార్డుకు ఎంపిక అయ్యింది. ఈ అవార్డు మార్చి తొమ్మిదో తేదీన హైద్రాబాద్ రవీంద్ర భారతి లో అందుకోనున్నారు. సంగారెడ్డి పట్టణం కు చెందిన నక్షత్ర నాట్య అకాడమీ నాట్య గురువు గీత యజ్ఞశ్రీ వద్ద శిక్షణ పొందుతున్నది.

జోగిపేటలో ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-జోగిపేట

గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జోగిపేటలో బీజేపీ అభ్యర్థులు డాక్టర్ అంజిరెడ్డి చిన్న మైల్, మల్కా కొమరయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని శుక్రవారంప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా నాయకులు జైస్వాల్ ప్రభాత్ కుమార్ , నాయకులు అంజనేయులు పాల్గొన్నారు.

కేతకి పై అలసత్వమెందుకు?





- గ్రేడ్ వన్ ఆలయమైనా అభివృద్ధికి నోచుకోని వైనం
- పైసా వెచ్చించని ప్రభుత్వాలు
- దశాబ్దాలుగా డిజిటల్ సేవలకు కలగని మోక్షం

నవతెలంగాణ-ఝరాసంగం

జిల్లాలోనే అత్యంత ప్రఖ్యాతిగాంచిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయం గత దశాబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఏటేటా ఆలయానికి భక్తుల రద్దీ పెరిగి ఆదాయం పెరుగుతున్నా.. మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ఒక అడుగు వెనక్కు వేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

కర్ణాటక రాష్ట్ర సరిహద్దు భూభాగంలోని ఝరాసంగం మండల కేంద్రములో వెలసిన ఈ జల లింగానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సందర్శకులు పెద్ద ఎత్తున వచ్చి దర్శించుకుంటారు. ప్రతీ మహాశివరాత్రికి జరిగే బ్రహ్మోత్సవాలతో పాటు శ్రావణమాసం, కార్తీకమాసం, ప్రతి అమావాస్య, సోమవారంతో పాటు ఇతర సెలవు దినాలలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. రద్దీ పెరగడంతో పాటు ఆలయానికి ప్రతీయేడు దాదాపు రూ.4 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. పెరిగిన ఆదాయానికి అనుగుణంగా ఆలయంలో మెరుగైన సౌకర్యాలు భక్తులకు కల్పించకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పైసా వెచ్చించని ప్రభుత్వాలు.. కలగానే మాస్టర్ ప్లాన్

ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వంలో జహీరాబాద్ నియోజకవర్గ మాజీ పార్లమెంట్ సభ్యులు బిబి పాటిల్ ఎన్నికై మొదటిసారిగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తానని అందుకు తన వంతులు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా గత పార్లమెంట్ సమావేశాల్లో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి ప్రసాద్ స్కీంలో చేర్చి రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. అందుకు అనుగుణంగానే గత ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ తయారకు సన్న ద్ధమయింది. మాస్టర్‌ప్లాన్లు భాగంగానే ఆలయంలో కొంత సర్వే జరిగినట్లు సమాచారం. అయిన గత పదేండ్లు నిధులు విడుదల చేసిన దాఖలాల్లేవు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వంలోనైనా నిధుల మంజూరు జరుగుతుందా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

అందుబాటులోకి రాని డిజిటల్ సేవలు..

కేతకి ఆలయంలో ఇప్పటివరకు డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురాలేదు. గత దశాబ్ద కాలం నుంచి ఉద్యోగులకు డ్రెస్ కోడ్, ఆలయంలో డిజిటల్ సేవలు అందుబాటులోకి తేవాలని భక్తులు అభిప్రాయాలను తెలుపుతున్నారు. ఈ డిజిటల్ సేవల ద్వారా అన్నదానం, వీఐపీల దర్శనం, ఆలయానికి భక్తులు ఇచ్చే విరాళాలు, ఆభరణాలు, వస్త్రాలకు తదితర వాటిలో డిజిటల్ సేవలు అమలు చేయవచ్చు. ఈ పద్ధతి ద్వారా అవినీతి, అక్రమాలు, అవక తవకలకు ఆస్కారం లేకుండా వీలుంటుంది. వీఐపీల దర్శనం కోసం వారి పేర్లు వివరాలు నమోదు చేసుకుని, ఆలయ అధికారులు ఇచ్చే పాసుల ద్వారా దర్శనం చేసుకోవచ్చు. స్వామి వారికి సమర్పించే వస్త్రాలు, ఆభరణాలు తదితర వాటికి బార్కోడ్ ద్వారా రికగ్నైజ్ చేసి డిజిటలైజేషన్ చేయవచ్చు. ఇలా చేయడం ద్వారా అవినీతి అక్రమాలకు చెక్ పెట్టవచ్చు. తద్వారా ఆలయం కూడా పెరిగే అవకాశం ఉంటుంది. ఆన్లైన్ డిజిటల్ సేవలను అమలుచేస్తున్న ఆలయాలను సందర్శించి అక్కడ అవలంబిస్తున్న టెక్నాలజీని అధ్యయనం చేసి ఇక్కడ తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

డిజిటల్ సేవలతో అక్రమాలకు చెక్..

కేతకి ఆలయంలో ఇంకా పాతకాలంలో లాగానే మానవ వనరుల మీదే ఆధారపడి సేవలు కొనసాగిస్తున్నారు. సాధారణ రోజులలో భక్తుల తాకిడి తక్కువగా ఉన్నప్పటికీ అమావాస్య, శ్రావణమాసం, కార్తీక మాసం, బ్రహ్మోత్సవాలకు భక్తుల రద్ది అత్యధికంగా ఉంటుంది. అంతేగాక బ్రహ్మోత్సవాలు ప్రారంభమైతే అభిషేకాలు, అగ్నిగుండాలు, రథోత్సవం, పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం వంటి కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్ లలో గంటల తరబడి నిరీక్షిస్తారు. కొన్ని సందర్భాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు దైవదర్శనం చేసుకోకుండానే భక్తులు వెనుతిరుగుతున్న పరిస్థితులు లేకపోలేదు. భక్తుల రద్దీ ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేస్తే వీలును బట్టి దర్శించుకునే అవకాశం ఉంటుంది. అదేగాక అర్జిత సేవలు, అభిషేకాలు, కళ్యాణం, కేశకాండనలు వంటి సేవాల సమాచారాన్ని ఆన్లైన్లో అందుబాటులోకి తీసుకొస్తే తద్వారా భక్తులకు సమయం కలిసి రావడంతో పాటు డబ్బులు కూడా ఆదా అయ్యే అవకాశం ఉంటుందని భక్తులు అభిప్రాయ పడుతున్నారు. ఆలయంలో భక్తులకు అందించే సేవలను ఆలయ ప్రధాన కూడల వద్ద డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేసి డిస్ప్లే చేస్తే భక్తులకు మేలు జరుగుతుంది. అంతేకాకుండా దైవ దర్శనానికి ఎంత సమయం పడుతుంది, క్యూ లైన్‌లో సమాచారం డిజిటల్ బోర్డుల ద్వారా సమాచారం అందివ్వాలని భక్తులు కోరుతున్నారు.

కొత్త పాలకవర్గం ఏర్పాటుపై నిర్లక్ష్యం..

జిల్లా నలువైపుల నుండి కేతకి బ్రహ్మోత్సవాలకు రెండు లక్షలకు పైగానే భక్తులు హాజరవుతారు. లక్షల మంది భక్తులు హాజరవుతు న్నప్పటికీ జిల్లా యంత్రాంగం మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. బ్రహ్మోత్సవాలపై ఈనెల 18న ఆర్డీవో సమక్షంలో వివిధ శాఖలతో కోఆర్డినేషన్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. పాలకవర్గం పదవి కాలం పూర్తయి ఏడాదిన్నర గడిచిపోయింది. దేవాదాయ శాఖ కొత్త పాలకవర్గ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసిన ఇప్పటివరకు కొత్త పాలకవర్గం కొలువుదీర లేదు. కేతకి ఆలయ పాలకవర్గంపై మొదటినుంచి నిర్లక్ష్యం కొనసాగుతోంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి కొత్త పాలకవర్గం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరోవైపు ఆలయ ఈవో రెగ్యులర్గా లేకపోవడంతో జాతర ఏర్పాట్లు పట్టించుకోవడం లేదు. దానికి తోడు ఆలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఉన్న కాస్త కిందిస్థాయి సిబ్బంది ఆలయంలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళల కోసం గదుల కొరత, నాలా డైవర్షన్, డబుల్ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తయిన పెండింగ్ పడడం, పార్కింగ్ వంటి అనేక సమస్యలు ప్రతి సంవత్సరం తలెత్తుతూనే ఉన్నాయి. అయినా జిల్లా యంత్రాంగం మాత్రం వాటికి శాశ్వత పరిష్కారాలు చూపడం లేదు. ఇన్చార్జి ఈవోలతోనే నెట్టుకు రావడంతో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి బ్రహ్మోత్సవాలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

ఝరాసంఘం జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నాలుగ్రోజులపాటు జరిగే ఝరాసంఘం కేతకి సంగమేశ్వర స్వామి జాతరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. ఝరాసంఘం కేతకి సంగమేశ్వర స్వామి జాతరకు సంబంధించి ఏర్పాట్లపై కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలో సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతరకు సుమారు రెండు లక్షల పైచిలుకు భక్తులు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుండి వచ్చే అవకాశం ఉన్నందున భక్తుల రద్దీకి అనుగుణంగా జాతర ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాతర సందర్భంగా ఆర్టీసీ అధికారులు ఆయా రూట్లలో ప్రత్యేక బస్సు సర్వీస్‌లో నడపాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్అండ్‌బి పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో జాతరకు ప్రజలు వచ్చే మార్గాల్లో రోడ్ల మరమ్మత్తు పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గ్రామీణ మంచినీటి సరఫరా మిషన్ భగీరథ ఆధ్వర్యంలో తాగునీటి వసతి ఏర్పాట్లు, పంచాయతీ రాజ్ శాఖ తరుపున మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో జాతరలో శానిటేషన్ పనులు పర్యవేక్షించాలన్నారు. జాతరలో నిరంతరం సీసీ కెమెరాలతో జాతరలో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయాలని, జాతరకు వచ్చే ప్రజల్లో తప్పిపోయిన చిన్నపిల్లలను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడం కోసం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జాతర ప్రదేశాలలో ప్రత్యేక హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది 24 గంటల పాటు క్యాంపులో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని వైద్యధికారులను ఆదేశించారు. జాతరలో 24 గంటల పాటు విద్యుత్ సౌకర్యం కల్పించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ట్రాన్స్కో సిబ్బందిని ఆదేశించారు. జాతర విధులకు కేటాయించిన సిబ్బంది అందరూ తమ కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించి జాతరను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో, ట్రెయినీ కలెక్టర్ మనోజ్, డీఆర్ఓ పద్మజ రాణి, డీపీఓ సాయిబాబా, ఎస్ఇ మిషన్ భగీరథ్ రఘువీర్, ఈఈపీఆర్, జగదీష్, జహీరాబాద్ ఆర్డీఓ రాం రెడ్డి, టెంపుల్ ఈవో శివరుద్రప్ప, ఆయా మండల ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మాతృ దినోత్సవం



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'అంతర్జాతీయ మాతృభాషా' దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళాశాలలోని ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు ఇతిహాసాలపైన క్విజ్ నిర్వహించారు. క్విజ్ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. పి. రమేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సంధ్యాలు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ అధ్యాపకులు టి.విద్యాసాగర్, బి శివకుమార్, కళాశాల అధ్యాపక , అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రజాస్వామ్యంలో పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని.. సమయం వచ్చినప్పుడు ప్రజలే తిరిగి అవకాశం ఇస్తారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్‌హాలులో ఎమ్మెల్యే అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. నియోజకవర్గ పరిధిలోని తెల్లాపూర్, అమీన్పూర్, బొల్లారం మున్సిపాల్టీల తాజా మాజీ పాలకవర్గాలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేండ్ల కాలంలో నూతనంగా ఏర్పడిన అమీన్పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డుని అభివృద్ధికి ప్రత్యేకగా తీర్చిదిద్దామన్నారు. ప్రతీ పాలకవర్గ సభ్యుడు ప్రజల సమస్యల పరిష్కారంలో ముందున్నారని అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే పంథాలో కొనసాగాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అమీన్పూర్, బొల్లారం మున్సి పాల్టీ పరిధిలో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించినట్టు గుర్తు చేశారు. అనంతరం పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనా రాయణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, కార్పొరేటర్ పుష్ప నగేష్,మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, తొంట అంజయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్లు లలిత సోమిరెడ్డి, పాండు రంగారెడ్డి, రోజా బాల్‌రెడ్డి, మాజీజెడ్పీటీసీలు,మాజీఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ పరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం



నవతెలంగాణ-పటాన్‌చెరు

బాధితులకు న్యాయ పరమైన విషయాల్లోఉచిత న్యాయ సహాయం అందించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ అన్నారు. జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆదేశాలతో మండలంలోని ముత్తంగిలో గల మహాత్మా జ్యోతి రావు పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహనా సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బి. రమేష్ మాట్లాడుతూ.. పిల్లలు చట్టలపైనా అవగాహనా కలిగి ఉండాలన్నారు. అందరూ క్రమశిక్షణగా ఉండాలని, న్యాయ వ్యవస్థలో ఎలా ఉండాలో వివరిస్తూ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అదేవిదంగా వారి బాగోగులను చూడడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలన్నారు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి భవిష్యత్తు నిర్దేశకులు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు న్యాయపరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత, వసతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి యాదవ్, సర్కిల్ ఇన్ స్పెక్టర్ వినాయక్ రెడ్డి, ప్రిన్సిపాల్ నవనిత,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నల్లాల నుంచి కలుషిత నీళ్లు..



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలో గత వారం రోజుల నుంచి నల్లాల ద్వారా ఎర్రగా ఉన్న, కలుషిత నీరు వస్తున్నదని.. దాంతో ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యతో సతమతం అవుతున్నారని సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి వి.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ ఇంజనీర్ ఏం చేస్తున్నారని, తక్షణమే మంచి నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సదాశివ పేటలోని పార్టీ కార్యలయంలో కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదాశివపేట పట్టణంలో గత వారం రోజుల నుంచి నల్లాల ద్వారా నీరు ఎర్రగా కలుషితమే వస్తున్నద న్నారు. ఈ నీటిని ప్రజలు ఏ విధంగా తాగుతారో మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పాల న్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం సిగ్గుచేట న్నారు. పట్టణంలో ప్రజలు ఎక్కువ మంది నల్లాల ద్వారా వచ్చి నీటిని తాగుతారని.. ఇలా కలుషిత నీరు వస్తే వాళ్ల ఎలా తాగుతారన్నారు. ప్రజలు మంచినీటిని కొనుక్కొని తాగాల్సి వస్తోందన్నారు. పట్టణంలో కొన్ని బస్తీల్లో పేద ప్రజలు ఇప్పటికీ ఆ కలుషిత నల్లా నీటినే తాగుతున్నారన్నారు. ఆ ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తే.. మున్సి పల్ అధికారులే బాధ్యత వహించాలన్నారు. మున్సిపల్ ఇంజనీర్ బాధ్యత రహితంగా వ్యవహరించడం తగదన్నారు. మున్సిపల్ ఇంజనీర్ పై జిల్లా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే పట్టణ ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలన్నారు. లేని యెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు రమేష్ గౌడ్, భూషణం, ఎండి ఖయ్యూం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని గోప్లారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇష్టానుసారంగా విధులకు గైర్హాజరు అవుతున్నాడని.. సమయపాలన కూడా పాటించడం లేదని వెంటనే ఆ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీఓ శ్రీనివాస్‌కు సదరు గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యదర్శి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందడం లేదని వారు ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలను ప్రైవేట్ వ్యక్తులతో చేయించడం వల్లే అర్హులకు లబ్ది చేకూరలేదని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన తమకు ఎందుకు రాలేదని కార్యదర్శిని అడగ్గా.. దబాయిస్తూ.. పథకాలకు తమకు ఎలాంటి సంబంధం లేదని పై అధికారులకు ఫిర్యాదు చేయండి అని నిర్లక్ష్యంగా చెబుతున్నాడని ఆరోపించారు. కాబట్టి సదరు కార్యదర్శిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

చౌటకూర్ ఎంపీడీవోగా శంకర్



నవతెలంగాణ-చౌటకూర్

చౌటకూర్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా శంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో ఇంచార్జ్ ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తూ జీవో నెంబర్ 317లో భాగంగా పుల్కల్ మండలంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. అక్కడినుండి చౌటకూర్ మండల ఇన్చార్జ్ ఎంపీడీవోగా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలకు ప్రతిరోజు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన రామలింగం మునిపల్లి మండల ఇన్చార్జ్ ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీకాంత్, కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ప్రీతం, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని శాలువాతో ఎంపీడీవోను సన్మానించారు.

శివశక్తి అనేది మతతత్వ సంస్థ



నవతెలంగాణ-జహీరాబాద్

శివశక్తి అనేది మతతత్వ సంస్థ అని.. అందుకే తాను రాజీనామా చేసినట్టు ఆ సంస్థ మహిళా అధ్యక్షురాలు జ్యోతి పడాల్ అన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుల మతాలను రెచ్చగొట్టే మతతత్వ సంస్థకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను కులమతాలకంటే మానవత్వం గొప్పదని నమ్ముతానన్నారు. మానవత్వంతో పది మందికి కూడా అన్నం పెట్టనివ్వని ఈ మతతత్వ సంస్థలు గానీ.. ఈ పదవులు నచ్చవు అన్నారు. అలాంటి సంస్థకి పని చేయలేననే ఆ సంస్థకు రాజీనామా చేశానన్నారు. అంతగా దిగజారి పని చేస్తున్న సంస్థకు జహీరాబాద్‌లో పని చేస్తున్న వ్యక్తులతో పని చేయాల్సిన అవసరం తనకు లేదన్నారు. దర్గాకి వెళ్తే వెళ్ళు.. కాని చాదర్‌ను ఎందుకు సమర్పించావు అని ప్రశ్నించడం వారి మత పిచ్చి, మూర్ఖత్వపు ధోరణి అని మండిపడ్డారు. ప్రజలకి సేవ చేయడంలో తనను ఎవ్వరు కూడా ఆపలేరన్నారు. కుల మతాలను రెచ్చగొట్టే విధంగా ప్రయత్నం చేసే వారు ఎంతటి వారైనా.. చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు వెనకాడనని హెచ్చరించారు.

యాసంగి వరి కోతలపై రైతులకు అవగాహన

- ఏవో సోమలింగారెడ్డి.

నవతెలంగాణ- నిజాంపేట



మండల కేంద్రంలోని రైతు వేదికలో 2024 - 2025 యాసంగి వరి కోతలపై వడ్ల కొనుగోలుపై తగు జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి. మాట్లాడుతూ వరి కోత కోసే సమయంలో హార్వెస్టర్‌లో ఉండే ఫ్యాన్ బెల్టు18-20 ఆర్ పి.ఎం ఉంచడం ద్వారా తాలు గింజలు ధాన్యంలో రాకుండా నివారించవచ్చన్నారు. ధాన్యాన్ని ముందుగానే ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తేమ శాతం 17% తక్కువ ఉండాలని, కచ్చితంగా ధాన్యాన్ని జల్లెడ పట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రమ్య , శ్రీలత రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మాడల్ ఇంటిని త్వరగా నిర్మించాలి

నవతెలంగాణ-టేక్మాల్



ఇందిరమ్మ మాడల్ ఇంటి నిర్మాణాన్ని త్వరగా చేపట్టి ప్రజలకు సందర్శనార్థం అందుబాటులోకి తీసుకురావాలని మండల అభివృద్ధి అధికారి విట్టల్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ ఆవరణంలో నిర్మాణం చేపడుతున్న మాడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఆయన సందర్శించి కాంట్రాక్టర్‌ను ఎప్పటిలోగా పూర్తి అవుతాయని అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తిచేస్తే ప్రజలకు అవగాహన వస్తుందని, ఎలా నిర్మించారనే విషయాన్ని అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ఇంటిని నిర్మించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. త్వరగా నిర్మిస్తే బిల్లులు తొందరగా వస్తాయని చెప్పారు.

నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు

- చిలిపిచేడ్ ఎస్సై నర్సిములు

నవతెలంగాణ-చిలిపిచేడ్



నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై నర్సింలు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిబ్బందితో మండల పరిధిలో వాహనాల తనిఖీ చేశామని తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న రెండు బైక్‌లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించామన్నారు. వాహన యజమానులు పోలీస్ స్టేషన్‌కి వచ్చి వాహన పత్రాలు చూపించిన తరువాత, వారిచే అట్టి వాహన నెంబర్ ప్లేట్‌లను పెట్టించి తిరిగి యజమానికి అందించామన్నారు . మండల పరిధిలో నెంబర్ ప్లేట్ లేకుండా బండి నడిపినట్లైతే వాటిని సిజ్ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ నర్సిములు తెలిపారు. మండల యువత నాయకులు మండల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దంతాన్‌పల్లిలో స్వయంపాలన దినోత్సవం



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని దంతాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఒకరోజు ఉపాధ్యాయులుగా నిర్వహించే స్వయంపాలన సందర్భంగా డీఈఓగా ప్రదీప్,ఎంపీడీఓగా హన్సిక, తహసీల్దార్‌గా యశ్వంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా దీక్షిత్, ఉపాధ్యాయులుగా నందిని, కృతిక, పీఈటీగా సాకేత్ వ్యవహరించారు. స్వయంపాలన వేడుకలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యం, ఉపాధ్యాయులు కవిత విద్యార్థుల బోధన సరళిని పర్యవేక్షించి, బోధనలో ఉత్తమ ప్రతిభ కనబరించినందుకు అభినందించి బహుమతులను అందజేశారు. ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామపంచాయతీ కార్మికుని అంత్యక్రియలకు ఆర్థికసాయం

- బాధిత కుటుంబానికి బాసటగా నిలిచిన నేతలు



నవతెలంగాణ-శివ్వంపేట

మండల పరిధిలోని సీతారాం తండా గ్రామపంచాయతీ కార్మికుడు, రత్నాపూర్ గ్రామానికి చెందిన పల్లె సత్తయ్య శుక్రవారం ఆకస్మాత్తుగా మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న మండల నాయకులు దివంగత సత్తయ్య పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. అందరిలో కలుపుగోలుగా ఉండే సత్తయ్య మృతి బాధాకరమని, ఆయన కుటుంబానికి మేమంతా అండగా ఉంటామని బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. సత్తయ్య అంత్యక్రియల కోసం, బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రైతుసమన్వయ సమితి మాజీ డైరెక్టర్, సీతారాం తండా మాజీ సర్పంచ్ సోని రవినాయక్, రత్నాపూర్ మాజీ సర్పంచ్ కుమ్మరి శంకర్, రత్నాపూర్ గ్రామకమిటీ మాజీ అధ్యక్షులు చిక్కుడు బాలేష్‌లు స్వంతంగా రూ.15 వేల ఆర్థిక సహాయన్ని పంచాయతీ కార్యదర్శి నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పల్లె సత్తయ్య మృతితో రత్నాపూర్ గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

బొలెరో గూడ్స్ వెహికల్ బోల్తా

- ఒకరు మృతి పలువురికి గాయాలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని ఆర్ఆర్ దాబాకు సమీపంలో శీర్యా వాగు దగ్గర బ్రిడ్జి పక్కన బోలేరో గూడ్స్ వెహికల్ బోల్తా పడి ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రోడ్డు కార్మికులు నేషనల్ హైవే రోడ్డుకు ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. శుక్రవారం బొలెరో గూడ్స్ వెహికల్ సిద్దిపేట నుంచి మెదక్ వెళ్తున్న క్రమంలో నిజాంపేట ఆర్ఆర్ దాబా సమీపంలో శిర్య వాగు దగ్గర బ్రిడ్జి పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అమ్రేష్ (32) చనిపోగా ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి 108 రెండు అంబులెన్సులలో తరలించారు. మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నవతెలంగాణ-కౌడిపల్లి

విద్యార్థులే ఉపాధ్యాయులుగా ఒకరోజు తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయులై విద్యా బోధన చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థిని విద్యార్థులకు విద్యాబోధన చేశారు. డీఈఓగా ప్రణవ్, హెచ్ఎంగా అజ్మత్ అలీ, ఎంఈఓగా గీతిక, టీచర్లుగా ప్రియా, లక్ష్మి, సునీత, మహేష్, నర్సింలు, హఫ్సానా, అశ్విని పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.



తల్లి భాష అమృతం లాంటిది

- అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో డీఈఓ రాధా కిషన్

నవతెలంగాణ-పాపన్నపేట



తల్లి భాష అమృతం లాంటిదని, తల్లి భాషను మరవద్దని జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ సూచించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రమైన పాపన్న పేటలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పద్య పఠనం పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాతృభాష తల్లి ద్వారా వస్తుందని, ప్రతి విద్యార్థికి తల్లి మొదటి గురువని, ఆమె ద్వారా వినడం, మాట్లాడడం నేర్చుకుంటాడని, ఇక గురువుద్వారా చదవడం, రాయడం నేర్చుకుంటాడని ఆయన వివరించారు. అందుకే ప్రతి ఒక్కరు ఎన్ని భాషలు నేర్చినా మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ఇటీవల కాలంలో తల్లిదండ్రులు ఇంగ్లీషు భాషపై మక్కువ పెంచుకోవడం మూలంగా తమ పిల్లలకు ఇంగ్లీషు రావాలని ఆశిస్తూ మాతృ భాషను పక్కకు పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లీష్ అయినా హిందీ అయినా మాతృభాష తర్వాతే అని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాపన్నపేట కాంప్లెక్స్ పరిధిలో నిర్వహించిన పద్య పఠనం, ధారాళంగా చదవడం పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ధారాళంగా చదవడంలో చీకోడ్ పాఠశాల చెందిన మోక్షిత, నార్సింగి పాఠశాలకు చెందిన పావని ప్రతిభ కనపరచగా, పద్య పఠనం పోటీలలో అరికెలకు చెందిన భావన, రాకేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరికి జిల్లా విద్యాశాఖ అధికారి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ సుదర్శన మూర్తి, మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, తెలుగు ఉపాధ్యాయులు అంజా గౌడ్, మంగ నర్సింలు, భట్టు నాగరాజు, ఉపాధ్యాయులు అంజనా చారి, శ్రావణి, అశ్విని, వినీత, బాబు, శరణ్యతోపాటు పాపన్నపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలి

- నిరంతర విద్యుత్ సరఫరాకు వినియోగదారులు సహకరించాలి
- విద్యుత్ శాఖ ఎస్ ఈ శంకర్

నవతెలంగాణ-మనోహరాబాద్



విద్యుత్ సరఫరాను నిలిపివేయకుండా నిరంతరాయంగా సరఫరాను అందించే విధంగా వినియోగదారులు సహకరించాలని పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని విద్యుత్ శాఖ ఎస్ ఈ శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మనోహరాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎస్ పీడీసీఎల్) వినియోగదారులకు సేవలను నిలిపివేయకుండా ఉండటానికి వారి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లు బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. టీజీఎస్ పీడీసీఎల్ బకాయిలు గణనీయంగా పేరుకుపోతున్నాయని దాంతో విద్యుత్ సరఫరాను నిర్వహించడానికి , మౌలిక సదుపాయాల మెరుగుదలలో పెట్టుబడి పెట్టడానికి కంపెనీ సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. వినియోగదారులందరికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను అందించడానికి టీ జీ ఎస్ పి డి సి ఎల్ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను తిరిగి పొందడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. అయితే, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు పేరుకుపోవడం తమ కార్యకలాపాలకు సవాలుగా మారుతుందన్నారు. కస్టమర్లకు సమర్థవంతంగా సేవ చేసే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. బకాయిలు చెల్లించని వినియోగదారులందరూ వెంటనే చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. దీర్ఘకాలంగా బకాయిలు చెల్లించని వినియోగదారుల కోసం పి జి ఎస్ పీడీసీఎల్ విద్యుత్ సరఫరాను తొలగించేందుకు కఠినమైన చర్యలను తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు. వినియోగదారులు విద్యుత్ బకాయిల ను చెల్లించేందుకు వివిధ అనుకూలమైన మార్గాల ద్వారా చెల్లింపులు చేయవచ్చు న్నారు. ఆన్‌లైన్ చెల్లింపులు, యాప్‌ల ద్వారా చెల్లింపులు చేయవచ్చన్నారు. విద్యుత్ బకాయిలను పూర్తిగా చెల్లించిన తర్వాతే కనెక్షనను పునరుద్ధరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.సందేహాలు ఉన్న వినియోగదారులు తమ సమీపంలోని టీజీఎస్ పీడీసీఎల్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డి ఈ గరుత్మంతా రాజు, ఏడిఈ శ్రీనివాస్ మనోహరాబాద్ ఇన్చార్జి ఏఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వరికోతలలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి వినయ్ కుమార్

నవతెలంగాణ-శివ్వంపేట



యాసంగి వరి పంటలను సాగు చేసిన రైతులందరు వరికోత సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి విన్సెంట్ విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని అల్లీపూర్, దొంతి, గోమారం రైతు వేదికలలో శుక్రవారం వ్యవసాయశాఖ సంచాలకులు సంధ్యారాణి, మండల వ్యవసాయాధికారి లావణ్యతో కలిసి వరికోత సమయంలో రైతులు తీసుకోవలసిన జాగ్రతల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.5 వందల బోనస్ చెల్లిస్తున్నందున వ్యవసాయ అధికారులు ధాన్యం కొనుగోలులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వరి కోతలను రైతులంతా ఏకకాలంలో కాకుండా విడతల వారిగా చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని అందుకు రైతులను సన్నద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. వరికోత మిషన్‌లతో కోతలు చేపడుతున్నందున కోత సమయంలో హార్వెస్టర్లు 18, 20 ఆర్పీయంలో నడిచేలా రైతులు చర్యలు చేపట్టాలని, అందుకు హార్వెస్టర్ల యజమానులతో అధికారులు సదస్సులు చేపట్టాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకనుగుణంగా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎవరి పట్ల దురుసుగా ప్రవర్థించలేదు:ఎస్‌బీఐ మేనేజర్

నవతెలంగాణ-కోహీర్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారులకు ఎస్‌బీఐ యాప్ అయిన యోనోని మాత్రమే వినియోగించాలని సూచిస్తామని, గూగుల్ పే, ఫోన్ పే లాంటి ఇతరత్రా యాప్‌లను ఫోన్‌లోకి చొప్పించడం, వినియోగం గురించి వివరించడం బ్యాంకు సిబ్బంది పనికాదని ఎస్‌బీఐ దిగ్వాల్ బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. బ్యాంకు ఖాతాదారుల్లో ఎవరి పట్ల కూడా సిబ్బంది దురుసుగా ప్రవర్తించేలదని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక కస్టమర్ పాస్‌బుక్ ప్రింట్ గురించి వచ్చినప్పుడు గూగుల్ పే, ఫోన్ పే యాప్‌లను తన ఫోన్‌లోకి చొప్పించాలని, వాటిని ఎలా వినియోగించాలో తెలియజేయాలని బ్యాంకు సిబ్బందిని వత్తిడి చేశారన్నారు. బ్యాంకు సిబ్బంది అందుకు నిరాకరించారన్నారు. బ్యాంకు సిబ్బంది కేవలం ఎస్‌బీఐ యాప్ యోనోను మాత్రమే సిఫార్సు చేస్తారని, ఫోన్‌పే, గూగుల్ పే లాంటి ఇతరత్రా యాప్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ సిఫార్సు చేయబడవని తెలిపారు. ఇతర యాపుల్ని వినియోగదారుల ఫోన్‌లోకి ఎలా చొప్పించాలనేది బ్యాంకు సిబ్బంది పని పరిధిలోకి రాదన్నారు. ఫోన్‌పే, గూగుల్ పే యాప్‌ల సమాచారాన్ని వినియోగదారులు బయటి వ్యక్తుల ద్వారా మాత్రమే తెలుసుకోవల్సి ఉంటుందన్నారు. ఇతర యాప్‌ల వినియోగంలో వచ్చిన సమస్యల విషయంలో బ్యాంకు సిబ్బంది ఏలాంటి జోక్యం చేసుకోవడం ఉండదన్నారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించి వచ్చిన సమస్యలను మాత్రమే బ్యాంకు సిబ్బంది బాధ్యత వహించి పరిష్కరిస్తారన్నారు. బ్యాంకు ఖాతాదారుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తామన్నారు. ఎవరి పట్ల దురుసుగా ప్రవర్థించేలదన్నారు.

సంగారెడ్డిలో బ్యాంకు ఉద్యోగుల ధర్నా

నవతెలంగాణ-సంగారెడ్డి



యూఎఫ్‌బీయూ యూనియన్ బ్యాంక్ అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ స్టేట్ సంగారెడ్డి రీజియన్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు రీజనల్ ఆఫీస్ ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది మాట్లాడుతూ బ్యాంకుల్లో తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సిబ్బందిపై అత్యధిక పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్ ఇండియన్ బ్యాంక్, క్లర్కులు క్యాషియర్లు ఆఫీసర్లు మేనేజర్లు, యూనియన్ సెక్రటరీ వెంకటేశ్వర్ రావు, ప్రెసిడెంట్ పవన్, మహేష్, సుదీర్, షణ్ముఖ్, గోవర్ధన్, కవిత, హారతి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీకి కృతజ్ఞతలు

నవతెలంగాణ-సిద్దిపేట



బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా నన్ను నియమించినందుకు పార్టీకి, పార్టీ అధ్యక్షులు కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, ఈటల రాజేందర్, మంత్రి బండి సంజయ్, లక్ష్మణులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నూతన అధ్యక్షులు శంకర్ ముదిరాజ్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 25 ఏండ్లుగా పార్టీలో కొనసాగుతున్నానని, ముదిరాజ్ బిడ్డగా తనకి అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఓ సైనికుడిగా, పార్టీకి విధేయుడుగా పనిచేస్తా అన్నారు. కార్యకర్తకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులు మల్కా కోమరయ్య, అంజిరెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద జాగ్రత్తలు పాటించాలి



నవతెలంగాణ-టేక్మాల్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లా సివిల్ సప్లై గోదాం సూపర్వైజర్ జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎలకుర్తి, కుసంగి, టేక్మాల్, కాదులూర్, ఎల్లుపేట్ గ్రామాలలో వరి కోతలు, వరి ధాన్యం కొనుగోలు సమయంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రైతులు సకాలంలో కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకొని వస్తే రైతులకు లాభం చేకూరుతుందన్నారు. సివిల్ సప్లై మేనేజర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరాలకు తగ్గట్టు అన్ని సౌకర్యాలు సమకూర్చాలని చెప్పారు. విశ్రాంతి తీసుకోవడానికి విడివిడిగా గదులను ఇవ్వాలని చెప్పారు. తాగునీటి వసతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, ఏఈవోలు రైతులు ఉన్నారు.

చెత్త, తాలు లేకుండా ధాన్యాన్ని తీసుకురావాలి

- డీసీఎస్ఓ సురేష్ రెడ్డి



నవతెలంగాణ-మనోహరాబాద్

రైతులు ధాన్యాన్ని ఎలాంటి చెత్త తాలు లాంటివి లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని డి సి ఎస్ ఓ సురేష్ రెడ్డి రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించే విషయమై శుక్రవారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డిసిఎస్ఓ సురేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు హార్వెస్టర్ల ద్వారా వరి కోత సమయంలో 18 నుంచి 20 అంతకన్నా ఎక్కువ ఆర్పిఎం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దాంతో కోత సమయంలోనే తాలు, చెత్త లాంటి పదార్థాలు ధాన్యం నుంచి వేరు చేసుకోవచ్చని ఆయన రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని శుభ్రం చేసి ఎండబెట్టి కొనుగోలు కేంద్రానికి టోకెన్లు సూచించిన రోజునే ధాన్యాన్ని తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని అమ్మాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారిని స్రవంతి, ఆర్ఐ దీక్షిత్, ఐకెపి ఎపిఎం పెంటా గౌడ్, ఏఈఓలు నరేందర్ గౌడ్, సచిన్, రైతులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ

నవతెలంగాణ-హవేలీఘనపూర్

మండల పరిధిలోని లింగం సాన్ పల్లి తండాలో శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జగదాంబ మాత ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శుక్రవారం తండాలో గ్రామ నాయకులు ఆయనను ఆహ్వానించి, ఆలయ ప్రాంగణంలో సేవాలాల్ ఆలయ పూజారుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీకి పూజారులు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తాండా ప్రజలు అందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలయ పూజారి దుల్యా నాయక్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోపాల్ రావు, తాజా మాజీ సర్పంచులు రమేష్ నాయక్, శ్రీను నాయక్, బిఆర్ఎస్ పార్టీ తండా అధ్యక్షులు బాబు నాయక్, మాజీ ఎంపిటిసి సూర్య నాయక్, కిషన్ నాయక్, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బీవీఆర్ ఐటీలో ఈ బాహ బగ్గిల పోటీలు

- పాల్గొన్న 77 జట్లు, సాంకేతిక విషయాలపై పరీక్షలు

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్‌ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ రోజు ఈ బాహ బగ్గిల పోటీలు నిర్వహించారు. ఈ బాహ కేటగిరి కోసం సే ఇండియా పోటీలలో రెండవ రోజు శుక్రవారం సాంకేతిక విషయాలపై పరీక్షలు నిర్వహిం చారు. ఈ పోటీలలో 19 రాష్ట్రాల నుంచి 88 టీములు దరఖాస్తు చేసుకోగా ఇందులో 77 జట్లు పాల్గొన్నాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ నుంచి 2, మహారాష్ట్ర నుంచి 23, తమిళనాడు నుంచి 17, తెలంగాణ నుంచి 2, కేరళ నుంచి ఏడు, ఢిల్లీ ఒకటి, ఒరిస్సా రెండు, మధ్యప్రదేశ్ 5, ఉత్తరప్రదేశ్ 3, గుజరాత్ 4, కర్ణాటక 4, ఉత్తరాఖండ్ ఒకటి, త్రిపుర ఒకటి, కర్ణాటక 4, ఛత్తీస్‌గడ్ ఒకటి, ఛండీఘడ్ ఒకటి, ఝార్ఖండ్ ఒకటి, జమ్ము కాశ్మీర్ ఒకటి, హర్యానా ఒకటి చొప్పు జట్లు పాల్గొన్నాయి. మన దేశంలోనే 19 రాష్ట్రాలకు చెందిన ప్రతిష్టాత్మకంగా చెందిన విద్యాసంస్థలు ఐఐటి, ఎన్ఐటి పేరుపొందిన 77 యూనివర్సిటీల నుంచి విద్యార్థుల చేత సొంతంగా డిజైన్ చేసుకొని వచ్చి వారి బగ్గిలతో ఈ బాహ సే ఇండియా 2025 పోటీలో పాల్గొన్నా రు. శుక్రవారం బగ్గిలకు సాంకేతిక తనిఖీలు బ్రేక్ టెస్ట్, వర్షపు తుఫాన్ పరీక్షలు, డిజైన్ ఫైనల్స్ ఆవిష్కరణలు, ధృవీకరణ ద్రోణా చార్య తరణం డైనమిక్ సంఘటనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విష్ణు విద్యా సంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య విస్సం, సే ఇండియా ఆర్గనైజర్ కమిటీ చైర్మన్ కేసీ హెూరా కన్వీనర్ కో కార్డే కార్ సీమోనా, ఆడేలినా పోపో వీసి కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దుబె,నేజర్ బాపిరాజు, డిజిఎం కాంతారావు ఏవో సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన విద్యుత్ శాఖ అధికారులు



నవతెలంగాణ-మర్కుక్

వేసవి దృష్టిలో ఉంచుకుని రైతు పంటలు ఎండకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గణేష్ పల్లి 33/11 కెవి సబ్ స్టేషను విద్యుత్ శాఖ డీఈ టెక్నికల్ శ్రీనాథ్, ఏడీ కన్స్ట్రక్షన్ కృష్ణమోహన్, గజ్వేల్ ఏడీ జగదీష్, మర్కుక్ సుధీర్ ,ప్రజాపూర్ ఏఈ కె.సత్యంతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఎర్త్ లకు నీళ్ళను ఎప్పటికప్పుడు పోస్తున్నరా ?..లేదా , ఫీడర్లు సరిగా ఉన్నాయా..? అని ఆరా తీశారు. లాగ్ బుక్‌లో రీడింగ్‌ను చెక్ చేశారు. సమయానికి విద్యుత్ గ్రామాల అందజేయాలని సూచించారు. అనంతరం అంగడికిష్టాపూర్, చేబర్తి గ్రామాల్లో రైతుల పోలాల వద్దకు వెళ్ళి రైతులతో విద్యుత్ ఎలా ఇస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో పొలాలు ఎండకుండా నీటిని పోదుపుగా వాడుకోవాలన్నారు. విద్యుత్ లైన్ మెన్ లక్ష్మణ్, గోవర్ధన్ రెడ్డి రైతులు, తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఎంపీడీవో రామ్మోహన్



నవతెలంగాణ-మద్దూరు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని రేబర్తి, గ్రామాన్ని, డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని అంగన్వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రం నుంచి వచ్చే పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని పరిశుభ్రమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్టువర్ట్సన్, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణమండపం నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

- పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం పై అంతస్తులో సకల సౌకర్యాలతో అత్యాధునికంగా నిర్మించిన ఏసీ కల్యాణమండపం నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది పాటు నిర్వహణకు రూ.12 లక్షలుగా నిర్ణయించామని ఆసక్తిగలవారు ఈ నెల 28 వరకు రూ.50 వేలు నగదు జమ చేసి పీఏసీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సీఈఓ పేర్కొన్నారు.

రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-మిరుదొడ్డి

మండలంలోని ధర్మారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి రూ.15 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు దుర్గారెడ్డి తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలపడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నేడు సీసీ రోడ్డు పనులను ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగమైన యాదగిరి, నారాయణ, నర్సింలు, యాదగిరి, బిక్షపతి, చంద్రం, చంద్రారెడ్డి పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలి



నవతెలంగాణ-చేర్యాల

విద్యార్థిని విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానికోసం నిరంతరం కృషి చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ అన్నారు. చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో శుక్రవారం పీఎంశ్రీ కార్యక్రమాల్లో భాగంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ మొదటి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ఎలా ప్రిపేర్ కావాలో అలాగే విద్యార్థుల మానసిక స్థితిని ఎలా దృఢపరుచుకోవాలో అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జినుగు బిక్షం ,వైస్ ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కబడ్డీలో సిద్దిపేట జిల్లా టీం విజయం



నవతెలంగాణ-మర్కుక్

వికారాబాద్‌లో జరుగుతున్న 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల బాల బాలికల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లా సబ్ జూనియర్ బాలుర జట్టు మొదటి విజయం సాధించినట్లు సిద్దిపేట జిల్లా కబడ్డీ ప్రధాన కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజుల నుంచి సిద్దిపేట జిల్లా బాలుర జట్టుకు ఏకలవ్య కబడ్డీ క్లబ్ వారు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ అనంతరం కబడ్డీలో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా టీంకు సెలక్షన్ చేసి వికారాబాద్‌కు పంపామన్నారు. శుక్రవారం సిద్దిపేట వర్సెస్ పెద్దపల్లి జిల్లాల మధ్య మ్యాచ్ జరగగా సిద్దిపేట జిల్లా బాలుర జట్టు 20 పాయింట్లతో విజయం సాధించిందన్నారు. ఈ సందర్భంగా ఏకలవ్య కబడ్డీ క్లబ్ అధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవ్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని విజయాలు సాధించాలని అకాంక్షించారు.

స్వేరోస్ ఆత్మీయ పలకరింపు..



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని ముత్తన్నపేట గ్రామానికి చెందిన బొర్ర బుచ్చవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం మృతురాలి కుటుంబ సభ్యులను స్వేరోస్ నెట్ వర్క్ కమిటీల సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం స్వేరోస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. స్వేరోస్ నెట్వర్క్ కో కన్వీనర్ గడప రాజు, జిల్లాధ్యక్షుడు ఉప్పులేటి బాబు, ఉపాధ్యక్షురాలు అమ్మఒడి సుభద్ర శ్యామల, మారుతి, పీపీఎల్ జిల్లా నాయకులు మెట్ల శంకర్, మంద జనార్ధన్, గాజుల బాబు, నర్సింల దశరథం,స్వేరో నాయకులు బోనగిరి ప్రభాకర్, చిలుముల మోహన్,విజనేష్ పాల్గొన్నారు.

ఆనాడు నీళ్లు ఇవ్వని హరీశ్ రావు నేడు మాట్లాడడం సిగ్గు చేటు



నవతెలంగాణ-నంగునూరు

ఆనాడు నీళ్ళు ఇవ్వని ఎమ్మెల్యే హరీశ్ రావు నేడు నీళ్ళ గురించి మాట్లాడడం సిగ్గు చేటని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆరోపించారు. శుక్రవారం నంగునూరు మండలం మగ్దంపూర్ గ్రామంలోని కోలుకొని కుంట, కొత్త కుంట ఊర చెరువు అను రెండు చెరువులకు నీళ్లు నింపడానికి నీళ్లు వెళ్ళే విదంగా అసంపూర్తిగా ఉన్న కాలువలను జేసీబీ తో సరి చేయిస్తూ మాట్లాడారు. నంగునూరు మండలంలోని అన్ని గ్రామాల్లోని చెరువులు నింపాలని జిల్లా ఇంచార్జి మంత్రి కొండ సురేఖకు, నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వెంటనే సంభందించిన అధికారులతో మమేకమై పనిచేస్తుంటే వారి ఓట్లతో గెలిచిన హరీశ్ రావు ఉద్దెర సలహాలు ఇస్తూ కాలయాపన చేస్తున్నాడని విమర్శించారు. పది ఏండ్లు అధికారంలో ఉన్న హరీశ్ రావు స్వంత నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో పనులు చేయలేదని వాపోయారు.

శ్రీ పార్వతీశ్వర స్వామి కళ్యాణ ఆహ్వానం

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్ : మహాశివరాత్రి పర్వది నము తిరస్కరించుకొని ప్రజ్ఞాపూర్ పార్వతీశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తుమ్మ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కళ్యాణ మహోత్సవానికి హాజరుకావాలని మాజీ ఎఫ్డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డిలకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 26న ప్రారంబమయ్యేశ్రీ పార్వతీశ్వర స్వామి కళ్యాణ పాల్గొనాల్సిందిగా కోరారు ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, నాయకులు దుర్గ ప్రసాద్,మతిన్,సమీర్, రమేష్, ఉపేందర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలి

- డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అధారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

మహిళ ఉద్యోగులను నోటిమాటల ద్వారా గాని, ఉద్యోగంలో ప్రమోషన్ కల్పిస్తామని బలవంతం చేయడం వంటివి పోష్ ఆక్ట్ కిందికి వస్తాయని, మహిళలు పని చేసి ఆఫీసులో మంచి వాతావరణం ఉండాలని, ప్రతి ఆఫీస్‌లో లైంగిక వేధింపుల నివారణ కోసం సంబంధిత యజమాని ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అధారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీస్ సహ కారంతో స్థానిక ఎన్జీవో భవన్ లో పోష్ ఆక్ట్ 2013 అంశంపై లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. అడిష నల్ కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి ఆక్ట్ కు సంబంధించిన పోస్టర్‌ను స్వాతి రెడ్డి ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి కార్యాలయంలో ఇంట ర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఏర్పాటు చేయనట్లయితే సంబం ధిత అధికారికి రూ.50 వేల జరిమానా ఈ చట్టం ద్వారా విధించడం జరుగుతుందనీ తెలిపారు. గవర్నమెంట్ ఆఫీసు లలో మహిళల పట్ల లైంగిక వేధింపులకు గురి చేసినట్లైతే అటువంటి వారు ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ చైర్పర్సన్ ముందు కంప్లైంట్ చేయాలనీ తెలిపారు. మహిళలకి నేరం జరిగిన 90 రోజులలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ముం దు పిర్యాదు చేసే అవకాశం ఉందని తెలిపారు. గరీ మా అగర్వాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆఫీసులలో లైంగిక వేధింపులు గురైన మహిళా ఉద్యోగులు షీ టీం లేదా భరోసా హెల్ప్ లైన్ నెంబర్‌కు కాల్ చేయాలనీ తెలిపారు. ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలో ఒక ఎంక్వైరీ ప్రూవ్ అయినందున సంబంధిత ఆఫీసర్ ని సస్పెండ్ చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ లక్ష్మీ కాంత్ రెడ్డి, సీఐ దుర్గ, ఎన్జీవో భవన్ అధ్యక్షులు అంజయ్య, డీసీపీఓ రాము, డ్వాక్ర గ్రూప్ మహిళలు, మహిళా ఉద్యోగులు, ఆశవర్కర్స్, నర్సింగ్ కళాశా ల విద్యార్థులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచి నీటిని పొదుపుగా వాడుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

మంచి నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృధా చేయవద్దని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పట్టణ ప్రజలకు సూచించారు. శుక్రవారం పట్టణంలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న సమయంలో రంగదాంపల్లిలో మంచి నీటిని వృధా చేయడం గమనించి, మంచి నీటిని పొదుపుగా వాడుకోవాలని ఇంటి యజమానులకు సూచించారు. పట్టణానికి మంచినీటిని సరఫరా చేయడానికి ఎంతో కృషి చేయాల్సి వస్తుందని, ఖర్చుతో కూడుకున్నదని, పట్టణ ప్రజలు మంచినీట ిని పొదుపుగా వాడుకొవా లని సూచిం చారు. ఇంట్లో వెలబడే చెత్తను బహిరంగ ప్రాంతాల్లో వేయ కుండా, రోజు ఉదయాన్నే వచ్చే మున్సిపల్ వాహనానికి మాత్రమే అందజేయాలని సూచించారు. పర్యటిస్తున్న సమ యంలో ఇళ్ళ మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, చీదు పెరిగి ఉండడం గమనించి వెంటనే అట్టి ఖాళీ స్థలం యజమానికి నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. వేములవాడ కమాన్ నుంచి సిరిసి ల్ల రోడ్డు వైపుగా పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న సమ యంలో రోడ్డు వైపున ఉన్న ఇసుక వెంటనే శుభ్రం చేయా లని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. మురికి కాలువలలో సిల్ట్, చెత్త లేకుండా తొలగించాలన్నారు. అనంతరం బుస్సాపూర్‌లోని రిసోర్స్ పార్కును పరిశీలించారు.

నర్సరిలో మొక్కలను సంరక్షించాలి

- మర్కుక్ ప్రత్యేక అధికారి బాలకృష్ణ





నవతెలంగాణ-మర్కుక్

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నర్సరీల్లో మొక్కలను జాగ్రత్తగా పెంచాలని మర్కుక్ మండల ప్రత్యేక అధికారి అడిషనల్ డీఆర్డీవో బాలకృష్ణ సూచించారు. మండల కేంద్రమైన మర్కుక్ నర్సరీని మర్కుక్ ఎంపీడీవో అశోక్‌తో కలసి శుక్రవారం ఆయన పరిశీలించి, నర్సరీ నిర్వహకులకు పలు సలహాలు, సూచనలు చేశారు. మండలంలో 16 గ్రామాలు గాను 35 వేల మొక్కలను లక్ష్యంగా పెంచుతున్నమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు తగు జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మోను ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందజేయాలని సూచించారు. ఎంపీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఎస్ఓ అధికారి ఇంచార్జి ఎంపీవో శాంతి, ఉపాధి హామీ ఈసీ సంధ్యరాణి, టిఏ స్వామి, నరేష్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, నర్సరీ నిర్వహకులు తదితరులున్నారు.

నరేందర్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలి







నవతెలంగాణ-బెజ్జంకి

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా వుట్కూరి నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని, మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కార్యకర్త లకు సూచించారు. మండల కేంద్రంలోని సత్యార్జునా గార్డెన్‌లో మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించా రు. మండలంలోని పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆయనను భారీ మేజారిటీతో ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని ఎమ్మె ల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ పులి క్రిష్ణ, మండల మహిళాధ్యక్షురాలు కనగండ్ల జ్యోతి, నాయకులు ఒగ్గు దామోదర్, శానగొండ శరత్, ఏఎంసీ వైస్ చైర్మెన్ చిలు వేరు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు మచ్చ కుమార్, పులి సంతోష్, అయా గ్రామాల పార్టీ శ్రేణులు హాజరయ్యారు.

నవతెలంగాణ-సిద్దిపేట

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యతవు ఓటు వేసి పట్టభద్రులు భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాడిపల్లి శ్రీనివాసరెడ్డి కోరారు. వివిధ విద్యాసంస్థల్లో నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని శుక్రవారం ప్రచారం నిర్వహిస్తూ, ఓటును ఏ విధంగా ప్రాధాన్యత ఇవ్వాలని ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీగా గెలుపొందితే మరిన్ని సౌకర్యాలు మన నియోజకవర్గానికి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో సీరియల్ నెంబ ర్ 2 పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నరేం దర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. నాయ కులు బాల్ రెడ్డి, అనిల్, మహేందర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కోహెడ

మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డినీ భారీ మెజార్టీతో గెలిపించాలని హుస్నాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ రెడ్డి అన్నారు. మండలంలోని రాంచంద్రపూర్ గ్రామంలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ముల్కల అరవింద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా నెరవేరుస్తూ వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వం అని అన్నారు. వ్యవసా య మార్కెట్ వైస్ చైర్మెన్ తిరుపతి రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు బత్తుల రాజు,సీనియర్ నాయకులు బొబ్బిలా మహేందర్ రెడ్డి,లక్ష్మణ్,మహేష్ లు ఉన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి





నవతెలంగాణ-మిరుదొడ్డి

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కు బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటి సీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడు తూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరిం చిందన్నారు. 24- 25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో కేవలం 7 శాతం నిధులు కేటాయించి తమ హామీని తామే తుంగలో తొక్కిందన్నారు. రానున్న బడ్జెట్ లోనైనా ఎన్నికల హామీ ప్రకారం 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలని రాష్ట్ర ముఖ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువై విద్యార్థులు సమ స్యల మధ్య చదువులు సాగిస్తున్నారని చెప్పారు .అస ర్ నివేదిక ప్రకారం 5.4 శాతం పాఠశాలలో టాయి లెట్స్ లేవని 19 శాతం బడులు పాడుబడ్డాయన్నారు. బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిం చాలని డీబీఎఫ్ పోస్ట్ కార్డ్ ఉద్యమాన్ని చేపట్టిందని తెలిపారు. ముఖ్యమంత్రికి విద్యార్థులు తల్లిదండ్రులు పోస్ట్ కార్డు రాసి ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.

నవతెలంగాణ-గజ్వేల్: రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయి స్తామని హామీ నిలబెట్టుకొవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రదాన కార్యదర్శి బ్యాగరి వేణు అధ్వర్యంలో గజ్వేల్ డిప్యూటీ తహసీల్దార్‌కి వినతిపత్రం ద్వారా ప్రభుత్వానికి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న 2025-26 బడ్జెట్ లోనైనా ఎన్నికల హామీ ప్రకారం 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువై విద్యార్థులు సమస్యల మధ్య చదువులు సాగిస్తున్నారని అసర్ నివేదిక స్పష్టం చెసిందన్నారు. అసర్ నివేదిక ప్రకారం 5.4 శాతం పాఠశాలలో టాయిలెట్స్ లేవని 19 శాతం బడులు పాడుబడ్డాయని పేర్కొన్నది. ప్రభుత్వ విద్యాలయంలో నాణ్యమైన, సమాన విద్యను అందించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించాలని కోరుతున్నామన్నారు.

పోస్ట్ ఆఫీస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నర్సారెడ్డికి ఘన సన్మానం



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ మున్సిపాలిటీలోని పోస్ట్ ఆఫీస్ ఐఓసీ భవనంలో మొదటి అంతస్తులో ఉండడంతో పోస్ట్ ఆఫీస్ ఖాతాదారులు అలాగే వృద్ధులైన పెన్షన్ దారులు చాలా ఇబ్బందుల గురి అయ్యారు. ఈ విషయంలో నర్సారెడ్డి చొరవ తీసుకొని కలెక్టర్‌తో మాట్లాడి పోస్ట్ ఆఫీస్‌ను అందరికీ అణువుగా ఉండేట్టు గ్రౌండ్ ఫ్లోర్లో ఏర్పాటు చేయించారు. దీనితో అటు ఖాతాదారులు ఇటు పోస్ట్ ఆఫీస్ ఉద్యోగులు కూడా సంతోషించి. ఈ విషయమై నర్సారెడ్డిని కలిసి పోస్ట్ ఆఫీస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆయనకు కృతజ్ఞత తెలిపి ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రెటరీ సాజిద్ బేగ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, డైరెక్టర్ డాక్టర్ వహీద్, మాజీ మున్సిపల్ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్ ,మైనారిటీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు, తదితరులు ఉన్నారు.

బుగ్గ రాజేశ్వర స్వామి వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

నారాయణరావుపేట మండల కేంద్రంలో బుగ్గ రాజేశ్వర స్వామి వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను దేవస్థానం కమిటీ చైర్మెన్ భాగన్న కరుణాకర్ సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహా శివరాత్రి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. ఏదైనా సమస్య వస్తే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి కౌన్సెలింగ్



నవతెలంగాణ-చేర్యాల

మద్యం సేవించి వాహనం నడిపిన వాహనదారులకు శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో చేర్యాల సీఐ ఎల్. శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. చేర్యాల సర్కిల్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన వ్యక్తులు, వివిధ ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేయగా మద్యం సేవించి ఉన్నట్లు రిపోర్ట్ రావడంతో 22 మంది వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వద్దని ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని, మీరు మీ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలని సూచించారు. హెల్మెట్ తప్పక ధరించాలని, రాంగ్ రూట్లో ప్రయాణించవద్దని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలని, నడిపే వాహనానికి ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పొల్యూషన్, సర్టిఫికెట్ తప్పకుండా ఉండాలని సూచించారు. అనంతరం మద్యం సేవించిన వారితో మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేయించారు. కౌన్సెలింగ్‌కు వచ్చిన 22 మందిని విడతలవారీగా కోర్టుకు పంపించడం జరుగుతుందని తెలిపారు.

పోటీ పరీక్షలకు అందుబాటులో పుస్తకాలు

- గజ్వేల్ లైబ్రేరియన్ తిరుపతి రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

ఇక్కడ పోటీ పరీక్షలకు విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజు వందమంది వరకు పాఠకులు గ్రంథాలయంకు వస్తున్నారు. ఈ విషయాలపై గజ్వేల్ గ్రంథాల యం లైబ్రేరియన్ తిరుపతిరెడ్డితో నవతెలంగాణ ముచ్చట..

నవతెలంగాణ: గ్రంథాలయంలో ఎన్ని పుస్తకాలు ఉన్నాయి..?

లైబ్రరియన్: గ్రంథాలయంలో పోటీ పరీక్షలతో పాటు అన్ని భాషల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సుమారు 1000 పుస్తకాల వరకు గ్రంథాలయంలో ఉన్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధ మవుతున్న విద్యార్థులు గ్రంథాలయంకు క్రమం తప్పకుండా వస్తూ చదువుతున్నారు.

నవతెలంగాణ: ఎన్ని భాషల పుస్తకాలు ఉన్నాయి.? అవి ఏమిటి..?


లైబ్రేరియన్: గజ్వేల్ గ్రంథాలయంలో నాలుగు భాషల పుస్తకాలు 15వేల 962 వరకు ఉన్నాయి. ఇందులో తెలుగు 11,849 ఉండగా, ఆంగ్లం 2,857 పుస్తకాలు ఉన్నాయి. అదేవి ధంగా ఉర్దూ 584 పుస్తకాలు ఉండగా హిందీ 672 వరకు ఉన్నా యి. వీటి ద్వారా పాఠకులు విజ్ఞానం పొందేందుకు ఎంతో ఉప యోగపడుతున్నాయి. పోటీ పరీక్షలకు సంబంధించి ఉద్యోగ సాధకులు రోజు వస్తున్నారు.

నవతెలంగాణ: గ్రంథాలయంకు ఏ ఏ పత్రికలు వస్తాయి..?

లైబ్రరియన్: గజ్వేల్ గ్రంథాలయానికి మొత్తం 10 దినపత్రికలు ఇందులో రెండు ఇంగ్లీష్ పత్రికలు, ఎనిమిది తెలుగు పత్రికలు వస్తున్నాయి. వాటిని నిత్య పాఠకులు గ్రంథాలయం కొచ్చి చదువుతున్నారు. దేశ, రాష్ట్ర, జిల్లా మండల స్థాయి విశేషాలను తెలుసుకుంటున్నారు.

నవతెలంగాణ: పక్ష, వార పత్రికలు వస్తున్నాయా..?

లైబ్రేరియన్: గ్రంథాలయంకు ఒక పక్షపత్రిక తోపాటు 9 మాస పత్రికలు వస్తున్నాయి. వీటి పై కూడా ప్రత్యేక దృష్టి పెట్టి చదువుతున్నారు. అనేక విషయాలను తెలుసుకుం టున్నారు.



నవతెలంగాణ: గ్రంథాలయం సమయం వేళలు ఎంతవరకు..?

లైబ్రేరియన్: గ్రంథాలయం సమయంలో ప్రతిరోజు 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు గ్రంథాలయం నిర్వహణ ఉంటుంది. ప్రతి శుక్రవా రం సెలవు కాగా, రెండవ శనివారం సెలవు ఉంటుంది. పాఠకులు సమయాన్ని గుర్తించి గ్రంథాల యానికి ప్రతిరోజు విధిగా వస్తున్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ఏటా గ్రంథాలయాల వారోత్సవాలు తమ పరిధిలో నిర్వహిస్తున్నాం.

నవతెలంగాణ: పక్కా భవనంలో గ్రంథాలయం కొనసాగుతుందా..?

లైబ్రరియన్: పాత గ్రంథాలయం శిథిలవస్తం కావడంతో ఉచిత వసతి భవనంలో గ్రంథాలయం ప్రస్తుతం కొనసాగుతుంది.

మైనార్టీ గురుకుల పాఠశాలలో తనిఖీ



నవతెలంగాణ-సిద్ధిపేట

పట్టణంలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) గరీమా అగర్వాల్ శుక్రవారం సందర్శించారు. కళాశాల ప్రాంగణంలోని తరగతి గదులను, భోజనశాలను, వంటశాలను, డార్మెటరీని తనిఖీ చేశారు. బాత్రూం, టాయిలెట్స్‌ని తనిఖీ చేసి పరిశుభ్రత పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాలలో కామన్ డైట్ మెనూ తప్పకుండా పాటించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో సంభాషించారు. విద్యార్థులను వారి సిలబస్ గురించి, జరుగుతున్నటువంటి పరీక్షల గురించి, ప్రతిరోజు నిర్వహించే స్లిప్ టెస్ట్ గురించి వాకబు చేశారు. విద్యార్థులను వారి సబ్జెక్టులలోని కొన్ని ప్రశ్నలు అడిగి వారి పురోగతి పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. రాబోయే పరీక్షలకు విద్యార్థులు తీసుకొనవలసిన తగు జాగ్రత్తలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాను ప్రకాష్, తహసీల్దార్ సలీం, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, జిల్లా వైద్యాధికారి పల్వాన్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెట్లను దహనం చేసిన దుండగులను పట్టుకుంటాం..

-సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
-గజ్వేల్ సీఐ బి.సైదా
నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



ఈత చెట్లను కాల్చి బూడిద చేసిన గుర్తుతెలియని వ్యక్తులను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ సీఐ బి. సైదా అన్నారు. శుక్రవారం అహ్మదీపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ కొత్త పల్లి నర్సగౌడ్, వైస్ ప్రెసిడెంట్ బోర్రనా సత్యనారాయణ గౌడ్, సీఐకి ఫిర్యాదు చేసారు. వెంటనే స్పందించిన గజ్వేల్ సీఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈత చెట్లను కాల్చిన వ్యక్తులు ఎవరైనా సరే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎల్లమ్మ గుడి దగ్గర చుట్టుపక్కల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల వలన ఎలాంటి నేరాలు జరగకుండా అరికట్టడానికి సీసీ కెమెరాలు సహాయ పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం సభ్యులు రామ గౌడ్, బాలు గౌడ్, బాల్ నర్స్ గౌడ్, జగన్ గౌడ్, అంజా గౌడ్, ముత్యం గౌడ్, నాగ మల్లయ్య గౌడ్, దుర్గయ్య గౌడ్ ,వెంకట్ గౌడ్, పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

-ఎస్ఐ రవికాంత్ రావు
నవతెలంగాణ-తొగుట



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రవికాంత్ రావు అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాంపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. ఎన్నికలు వస్తుంటాయి, పోతుంటాయి, వాటిని అడ్డం పెట్టు కొని గొడవలకు దిగవద్దని సూచించారు. శాంతి యుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరన్నా అను మానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100కు కాల్ చేసి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్‌లో డాటాను నమోదు చేయాలి

-సీపీ.డాక్టర్ బి.అనురాధ
నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



సెల్ ఫోన్ ఎక్కడైనా పడిపోయిన, ఎవ్వరైనా దొంగలించిన వెంటనే సీఈఐఆర్‌లో డాటా నమోదు చేయాలని సీపీ.డాక్టర్ బి. అనురాధ అన్నారు. గత కొన్ని రోజుల నుంచి పడిపోయిన, దొంగలించబడిన 105 ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీతో రికవరీ చేసి సీపీ ఆఫీస్‌లో ఆమె సంబంధిత బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఈఐఆర్ లో డాటా నమోదు చేయడం వల్ల ఫోన్ రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. సీఈఐఆర్ వర్టికల్ సిబ్బంది నలుగురు కానిస్టేబుళ్ల ఫోన్ల రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు, వారిని అభినందించి అప్రిసియేషన్ సర్టిఫికెట్ లను వారికి అందజేసారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, సీఈఐఆర్ మానిటర్ మహిళ కానిస్టేబుల్ స్వప్న, ఐటీ సెల్ సిబ్బంది స్వామి, రాజిరెడ్డి, హరీష్, శ్రీకాంత్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని బ్యాంకు ఉద్యోగులు ధర్నా

నవతెలంగాణ-సిద్దిపేట



బ్యాంకుల్లో నూతన నియామకాలు చేపట్టాలని యూఎఫ్‌బీయూ, యూనియన్ బ్యాంక్ అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ స్టేట్ సిద్దిపేట రీజియన్ ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు యూనియన్ బ్యాంకు రీజనల్ ఆఫీస్ ముందు శుక్రవారం ధర్నా నిర్వహించిరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకుల్లో తగినంత సిబ్బంది లేకపోవడం వలన పని ఒత్తిడి అవుతుందని, కొత్తగా ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో సిబ్బందిపై అత్యధిక పని ఒత్తిడి జరుగుతుంది, అందువలన నియామకాలు చేపట్టాలన్నారు. మా డిమాండ్లు..ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలి, అవుట్సోర్సింగ్ విధానం రద్దు చేయాలి, కొత్తగా సిబ్బంది నియామకాలు చేపట్టాలి, బ్యాంకులో ప్రైవేటైజేషన్ ఆపాలి, బ్యాంకుల విలీనం చేయకుండా ఆపాలి, కస్టమర్లపై అధిక చార్జీలు తగ్గించాలి, ఫిక్స్ డిపాజిట్‌లపై వడ్డీ రేట్లు పెంచాలి. వీటిని అమలు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నలో రీజనల్ సెక్రెటరీ శ్రీనివాస్ బోండ్ల, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ఆఫ్ బరోడా పంజాబ్ నేషనల్ బ్యాంక్ కెనరా బ్యాంక్ ఇండియన్ బ్యాంక్ క్లర్కులు, క్యాషియర్లు, ఆఫీసర్లు, మేనేజర్లు, టెంపరరీ స్టాఫ్, సిద్దు, దినేష్, మధు, ముఖేష్, శ్రీనివాస్ అప్రైజర్స్, యూనియన్ సభ్యులు, పాల్గొన్నారు

డయల్ 100కు కాల్ చేయాలి : ఎస్ఐ పి.నీరేశ్




నవతెలంగాణ-చేర్యాల

గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరే కమైన కార్యక్రమాలకు పాల్పడిన, అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని చేర్యాల ఎస్ఐ పి.నీరేశ్ సూచించారు. మండల పరిధిలోని కొత్త దొమ్మాట గ్రామాన్ని శుక్రవారం ఎస్ఐ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని, ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయని వాటిని అడ్డం పెట్టుకొని గొడవలకు దిగవద్దని, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా వాణి విద్యాలయం వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్‌లో వాణి విద్యాలయం వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి కృష్ణ, ఆర్య సమాజ్ నల్ల సత్యదేవ్ పండిత్, ప్రముఖ మెజీషియన్ టీవీ ఆర్టిస్ట్ కొత్తపల్లి అర్జున్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాణి విద్యాలయం డైరెక్టర్ మధుబాబు విద్యార్థిని, విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తూ, వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాదృక్పథంతో పాఠశాలను కొనసాగిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నాడని, పాఠశాల యాజమాన్యం సిబ్బందికి అభినందనలు తెలిపారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత టీచర్ దేవగనిక శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం వివిధ క్రీడలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వాణి విద్యాలయం డైరెక్టర్ సంగని మధు బాబు, ప్రిన్సిపాల్ సరళ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈఓ

నవతెలంగాణ-దుబ్బాక

రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో సిద్దిపేట జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేలా 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి జడ్పీహెచ్ఎస్, లచ్చపేటలోని ఎంపీపీఎస్, మండల పరిధిలోని పెద్ద చీకోడ్ ప్రైమరీ, జడ్పీహెచ్ఎస్, రామక్కపేటలోని ప్రైమరీ, జెడ్పీహెచ్ఎస్, గంబీర్‌పూర్ లోని ప్రైమరీ, జెడ్పీహెచ్ఎస్ స్కూల్ లను ఎంఈఓ ప్రభుదాస్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులకు స్లిప్ టెస్ట్‌లను నిర్వహించాలని సూచించారు. ఎఫ్ ఎల్ఎస్, ఎల్ఐపీ, అపార్ జనరేషన్, ఎండీఎం నిర్వహణ, వినియోగం, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం బయో సైన్స్, మ్యాథ్స్ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైన పెద్దచీకోడ్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినీలు కాసర్ల భువన, అమృతది దీక్షితలను డీఈవో శ్రీనివాసరెడ్డి శాలువాలతో సన్మానించారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సీఆర్పీలు పలువురున్నారు.





కేసీఆర్ ఇలాకలో.. నిలువ నీడ లేదాయె..!

- నలుగురు ప్రయాణికులకు నీడ ఇవ్వని నాలుగు బస్టాండ్లు
- అన్ని కాలాల్లో ప్రయాణికులకు ప్రయాసాలే..
- రూ. కోట్ల నిధులు బూడిదలో పోసిన పన్నీరు..







నవతెలంగాణ-గజ్వేల్

రెండుసార్లు ముఖ్యమంత్రి, ఒకసారి ఎమ్మెల్యేగా ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్న కేసీఆర్ ఇలాఖలో ఒక బస్టాండ్ కూడా నలుగురి ప్రయాణికులకు నీడనిచ్చే పరిస్థితి లేదు. 1994-95 మధ్యన ప్రజ్ఞాపూర్ గ్రామంలో బస్ డిపోతోపాటు బస్టాండ్ నిర్మించారు. గజ్వేల్ పట్టణానికి నాలుగు కిలోమీటర్లు ఉండగా ప్రజ్ఞాపూర్‌కు కిలోమీటర్ దూరంలో ఈ బస్టాండ్ నిర్మించారు. దీన్ని డీఎం కార్యాలయంగా బస్టాండ్‌ను మార్చుకున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.25 లక్షలతో బస్టాండు 12 ప్లాట్ఫారాలతో నిర్మించారు. కేసీఆర్ సీఎం అయిన తరువాత ఆ బస్టాండ్‌ను కూల్చివేసి ఆరున్నర ఎకరాల్లో వేజ్ నాన్ వెజ్ మార్కెట్‌ను రూ.20 కోట్ల నిధులతో నిర్మించారు. గజ్వేల్ పట్టణ ప్రజలు ప్రతిపక్షాలు, పత్రికల గొంతు తెరవడంతో గజ్వేల్ పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో రూ.ఐదు కోట్లతో బస్టాండ్ నిర్మాణం చేశారు. ఈ బస్టాండ్‌ను 2024 అసెంబ్లీ ఎన్నికల ముందు ఆ బస్టాండ్‌ను అప్పటి మంత్రి హరీశ్ రావు ప్రారంభించి వదిలేశారు. అయితే దూరంగా నిర్మించిన బస్టాండ్లు ప్రజలకు అందుబాటులో లేదని గజ్వేల్ పట్టణంలో పాత స్థలంలోనే ఉన్న కొద్దిపాటి స్థలంలో రూ.3 కోట్ల నిధులను మంజూరు చేసి గత ప్రభుత్వం బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. ఈ బస్టాండులో ఒక బస్సు నిలబడితే మరో బస్సుకు వెళ్లే పరిస్థితి లేదు. బస్టాండ్లో సైతం తగిన ప్రయాణికులకు నీడ కలిగే అవకాశం లేదు. ప్రజ్ఞాపూర్‌లో సైతం రూ 4.5 కోట్లతో మరో బస్టాండ్‌ను నిర్మాణం చేపడుతుంది. గజ్వేల్ పట్టణంలో రెండు కొత్త బస్టాండ్‌లో నిర్మాణం జరుగుతున్నప్పటికీ అవి ఏవి ప్రజలకు ప్రయాణికులకు ఉపయోగంగా ఉండే అవకాశం లేదు. కేసీఆర్, హరీశ్ రావులు దృష్టి పెట్టకపోవడం వల్లే స్థానిక ప్రజలకు ప్రయాణికులకు నష్టం జరిగిందని విమర్శలు ఉన్నాయి.

ప్రజలకు సౌకర్యంగా మార్చాలి.



బస్టాండుకు వచ్చే మా అటువంటి వారికి సౌకర్యం ఉండాలి. ఏండ్లు గడుస్తుంది. బస్టాండ్ పూర్తిగా కాలేదు. వెంటనే బస్టాండ్ పూర్తి చేయాలి. రోడ్లపైనే ఉంటున్నాం.

-మహిళా ప్రయాణికురాలు కిష్టవ, అమ్మదిపూర్

ఎండలకు రోగాలు వచ్చాయి.



ఎండలకు రోగాలు వచ్చే అవకాశం ఉంది. పిల్లల తల్లులు బస్సు కోసం బస్టాండ్ కొస్తే నీడ లేదు. నీళ్ల లేవు. వర్షాకాలం, ఎండాకాలం , చలికాలం ఇదే పరిస్థితి ఉంది. గజ్వేల్‌లో రాజకీయ నాయకులు పట్టించు కోవాలి. ఇదేం పరిస్థితి.

-మహిళా ప్రయాణికురాలు శ్యామల, మోతే

బస్టాండ్ పనులు పూర్తి చేయండి.



గజ్వేల్ బస్టాండ్ పనులు పూర్తి చేయండి. ప్రయాణికులం రోడ్లపై ఉంటు న్నాం. రాకపోకలకు ఇబ్బంది ఉంది. వేసవి ఎండలు ముదురుతున్నాయి. చిన్నపిల్లలు పెద్దలకు ఎండ దెబ్బ తలిగితే జనాలు వచ్చే అవకాశం ఉంది. పనులు పూర్తి చేయండి.

ప్రయాణికుడు భాష, దుబ్బాక.

ఇంకెంతకాలం బస్టాండ్ కష్టాలు



నేను ఎప్పుడు చూసినా బస్టాండ్ ఇంతే ఉంటుంది. ఎండకి ఎండుతున్నావ్ వానకు నానుతున్నావ్ చలికి చస్తున్నాం. ఇదేం పరిస్థితి. స్కూల్ పిల్లలకు ఇంతమంది వస్తున్నారు. వీళ్లకు సౌకర్యాలు లేవు. ప్రభుత్వం స్పందించి వెంటనే బస్టాండ్ నిర్మాణం పూర్తి చేసి సౌకర్యాలు కల్పించాలి.

-ప్రయాణికుడు లక్ష్మయ్య. లింగుపల్లి

మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలి

కులబ్‌గూరు గ్రామ మాజీ వార్డు మెంబర్ కృష్ణ
నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాది శివారు ప్రాంతాల్లో నిన్న మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు కాకుండా పోలీసులు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కులబ్గూరు గ్రామ మాజీ వార్డు మెంబర్ పి.కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్న 8 ఏళ్ల వయసు గల చిన్నారిని నిందితులు మద్యం మత్తులో లైంగిక దాడికి పాల్పడ్డారని ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. వారం రోజుల క్రితమే జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆవరణంలో భర్త కళ్ల ముందే మహిళపై అత్యాచార ఘటన జరిగిందని ఇలాంటి వరుస ఘటన నేపథ్యంలో శివారు గ్రామాల ప్రజలు, విద్యార్థినిలు, మహిళల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో వరుసగా ఇలాంటి ఘటనలు జరుగడం బాధాకరమని, రోడ్డుకు ఇరువైపులా సీసీ కెమెరాల నిఘా పెంచి పోలీసుల గస్తీ పెంచాలని ప్రజల్లో ఉన్న భయాందోళన తొలగించి విద్యార్థినులకు, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సినిమాలు, సాహిత్యం, ఇంటర్నెట్ మాధ్యమాల్లో హింస, అశ్లీలత అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేసి నిందితులకు వెంటనే కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు.

పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు ఇమామ్
నవతెలంగాణ-సిద్దిపేట



మెదక్, నిజాంబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి పోటీ చేస్తున్నారని, ఆయన విజయం కోసం శనివారం సాయంత్రం ఐదు గంటలకు శక్తి గార్డెన్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌లు తెలిపారు. శుక్రవారం విలేకర్లతో వారు మాట్లాడుతూ.. సిద్దిపేటలో మొట్టమొదటిసారిగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులతో కలిసి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మేళనానికి మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, మైనంపల్లి హనుమంతరావు, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి హాజరవుతారని అన్నారు. ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పట్టబద్రులను, ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు గంప మహేందర్, గోపికృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మీ, వహీద్ ఖాన్, ఖలీముద్దీన్, రాషాద్, మెరుగు రాజు, గయాజుద్దీన్, సంతోష, రజిని, సన, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్జ పిట్టల ఫామ్‌తో అధిక లాభాలు

- పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వ విద్యాలయం కోర్స్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్

నవతెలంగాణ-మద్దూరు

కమ్జ పిట్టల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని పీవీ నరసింహారావు రాష్ట్ర పశు వైద్య విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ కోర్స్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో మద్దూరు మాజీ ఎంపీపీ బద్దిపడే కృష్ణారెడ్డి, తన వ్యవసాయ క్షేత్రంలో పెంచుతున్న కమ్జ పిట్టల ఫామ్‌ను పివి నరసింహారావు ,రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం పశు వైద్య కళాశాలలో చదువుతున్న తమిళనాడు, కేరళ, అస్సాం, జార్ఖండ్, ఒరిస్సా, తెలంగాణ, రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రొఫెసర్లు పరిశీలించారు. అనంతరం ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు పాడి, పంటలు, బాయిలర్ కోళ్ల ఫామ్‌లతోపాటు కమ్జ పిట్టల, పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. కమ్జ పిట్టల పెంపకంలో రాణిస్తున్న మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డిని అభినందించారు. అదేవిధంగా ప్రొఫెసర్లు అందరు కలిసి కృష్ణారెడ్డిని శాలువా మెమెంటోతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు రాంబాబు, పరుశురాములు, ప్రశాంత్, సురేష్, శిరీష, తదితరులు ఉన్నారు.



పంచాయతీ సెక్రెటరీని విధుల నుంచి బహిష్కరించాలి

- ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-ములుగు

మాదిగ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పంచాయితీ సెక్రటరీని విధులు నుంచి బహిష్కరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే ఇలాంటి సంస్కృతి గ్రామాల్లో పారుకు పోతుందంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని వాగునూతి పంచాయతీ కార్యదర్శి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతూ.. మాదిగ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసింది. దీంతో ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ కులస్తులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా పంచాయితీ కార్యదర్శి ఎదవిధిగా విధులకు హాజరవుతుండటంతో రెండు రోజుల క్రితం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేష్, ములుగు మండల అధ్యక్షుడు ఆదాసు మహేష్, ఆయా మండలాల నాయకులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్‌కి పంచాయితీ కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. ఇక పై అధికారుల సూచన మేరకు శుక్రవారం డీపీఎల్ఓ లత వాగునూతి గ్రామానికి విచారణ నిమిత్తం వచ్చి ఇరువర్గాల వాదనలు విన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇరువర్గాల వాదనలను నమోదు చేసుకున్నామని, ఈ విచారణ పత్రాలను పై అధికారులకు నివేదిక పంపుతామని డీపీఎల్ఓ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఏళ్లుగా, ఊహ తెలిసినప్పటి నుండి గ్రామంలోని అన్ని వర్గీయులను సమానంగా చూసే పంచాయితీ కార్యదర్శి ఇలాంటి మాటలు మాట్లాడటం చూడలేదన్నారు. అధికారులు చొరవచూపి పంచాయతీ కార్యదర్శిపై తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మల్లేష్, జగదేవపూర్ మండల అధ్యక్షులు పోసాన్పల్లి రాజు,ములుగు మండల ఎమ్మార్పీఎస్ కార్యదర్శి కొమ్ము వినోద్, క్షీరసాగర్ ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు గుడ్ల అశోక్ నల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణ కేంద్రంలో శుక్రవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రేఖాగౌడ్ ఆధ్వర్యంలో నర్సారెడ్డిని శాలువా తో సత్కరించారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ.. గౌడ సమాజం అభివృద్ధి కోసం మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి చేస్తున్న కృషి అభినందనీయమని, ఒక మహిళగా ఉండి అటు వ్యాపారంలో ఇటు గౌడ సమాజం అభివృద్ధి కోసం తన వంతు పాత్ర వహిస్తూ పలువురి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ రేఖ గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని నర్సారెడ్డి అన్నారు. గౌడ సమాజం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బైరి శంకర్ ముదిరాజ్‌ను కలిసిన వాసర యాదమల్లు

నవతెలంగాణ-నంగునూరు



సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు జగా నూతనంగా నియమి తులైన బైరి శంకర్ ముదిరాజ్‌ను నంగునూరు మండలానికి చెందిన జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు వాసర యాదమల్లు మర్యాదపూర్వకంగా కలిశారు. బైరి శంకర్‌కు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. బీసీ సామాజిక వర్గానికి, రాష్ట్ర పార్టీ నాయకత్వం సముచిత స్థానం కల్పించినందుకు గర్వంగా ఉందని యాదమల్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఘనంగా అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం











నవతెలంగాణ-చేర్యాల

మండల పరిధిలోని అర్జున్ పట్ల ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 21 మంది విద్యార్థులు తెలుగు దనం ఉట్టి పడేట్లు తెలుగు భాషకు మకుటం అయిన పద్యాలను ఆపకుండా పద్యాలకు పద్యాలే సమాధానంగా పద్యాలతో రణంగా పద్యాలతో రణం సృష్టించారు. భాషా ప్రక్రియ అయిన హరికథ ద్వారా విద్యార్థి విష్ణువర్ధన్ భాషా గొప్పతనాన్ని అద్భుతంగా ప్రదర్శించాడు. 21 మంది విద్యార్థులు సుమారు 100 పద్యాలను నిరంతరాయంగా నిరాటంకంగా సవాలు ప్రతి సవాలును పద్యాలుగా చదవడం ఇదే ప్రథమం, అద్భుతం అని ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలసాహిత్య కవి శ్రీవాణి సాహిత్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ పెందోట వెంకటేశ్వర్లు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా పద్యాలు చదివిన 21 మందిని ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథి పెందోట కు శాలువా, మెమెంటో తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు యశోద, సుదర్శన్ రెడ్డి, గంగప్రసాద, కులకర్ణి, సరిత, రజిత,షాదుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బక్రిచెప్యాలలో ప్రధానోపాధ్యాయులు నాగేందర్ రెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించు కొని విద్యార్థులకు కథల పోటీలు, పద్యాల పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడు తూ మాతృభాష తెలుగును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదన్నారు. తెలుగు భాష ఉపాధ్యాయులు వర్కోలు లక్ష్మయ్య మాట్లాడుతూ.. తెలుగు భాషపై పట్టును సాధించినట్లైతే ప్రతి విద్యార్థి అన్ని భాషలు సులభంగా నేర్చుకోవచ్చని తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులకు కథలు, పాటలు, పద్యాల పుస్తకాలను బహుమ తులుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేం దర్ రెడ్డి, అనిల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక మాడ్యులస్ పాఠశాలలో.. ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మాడ్యులస్ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరూ తెలుగు భాష గొప్పదనాన్ని గురించి తెలియజేసే పాటలు, కవితలు, గేయాలు ఆలపించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జ్యోతి రెడ్డి, ఇంచార్జ్ అల్లా బక్షు, తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి : కన్నతల్లి ద్వారా శిశువు నేర్చుకునే మాతృభాషను నిర్లక్ష్యం చేయరాదని మిరుదొడ్డి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ అర్చన ప్రియదర్శిని అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ జాతిలోనైనా మాతృభాషను గొప్పగా ఎవరు ఇస్తారని, కానీ ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు భాష మాత్రం నిరాదరణకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితులు తలెత్తుతాయని, మాతృభాషను ప్రేమించే ప్రతి ఒక్కరూ మన తెలుగును పరిరక్షిం చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యా యులు పరమేశ్వర చారి, బాలయ్య, స్వామి ఇతర ఉపాధ్యా యులు విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వర్గల్: మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాల యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ రాజేందర్ తెలిపారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తెలుగు పద్యాలు, జాతీయులు, వ్యాసాలు వ్రాయడంలో పాల్గొన్నారు. తెలుగు భాష ఉపాధ్యాయులైన ఝాన్సీ, విజయ్ కుమార్‌లు మాతృభాష గొప్పదనాన్ని గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. నవోదయ విద్యాలయంలో త్రిభాషా సూత్ర అమలు జరుగుతుం దన్నారు. మాతృభాషలో పట్టు సాధిస్తే ఇతర భాషలు సులభంగా నేర్చుకోవచ్చని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిం చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని మాతృభాష దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్, నిఖత్ అంజుమ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను కాపాడుకుంటూ పరభాష జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ గణపతి రావు మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే చాలా గిరిజన భాషలు కనుమరుగయ్యాని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా గిరిజనులకు పైనే ఉందని సూచించారు. తెలుగు విభాగం అధ్యక్షులు డాక్టర్ ఆర్ మహేంద్రరెడ్డి మాట్లాడుతూ మాతృభాషలో పట్టు సాధిస్తే మిగతా సబ్జెక్టుల విషయాలు సులభంగా అర్థమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు మిగతా అధ్యాపకులు పాల్గొనడంతో విజయవంతమైంది.

ఓటు హక్కు ఉన్న ఉద్యోగులకు 27న సెలవు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 27న జరగనున్న కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 27న రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు ప్రకటించిందన్నారు. కావున ఉద్యోగులు 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు.

ఆగిన మట్టి రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-వట్పల్లి

మండలంలోని గౌతాపూర్ గ్రౌరె కల్ పరిధిలోని ఆమ్లెట్ విలేజ్ హుస్సేన్ నగర్ వరకు ఆరు నెలల క్రితం చేపట్టిన ఫార్మేషన్ రోడ్డు పనులు అర్థం తరంగా నిలిచిపోయాయి మళ్లీ అసంపూర్తిగా మిగిలిన ఫార్మేషన్ రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి కోటి 30 లక్షల నిధులు రోడ్డు నిర్మాణ పనులకు మంజూరయ్యాయి చేపట్టిన పనులకు జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి పనుల నిధుల కింద 62 లక్షల రూపాయలు గ్రామపంచాయతీ ఖాతాలో నికి చేరుకున్నాయి చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించేందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు విమర్శలు వెల్లి వెతుకుతున్నాయి చెరువు కట్ట నుండి మోడల్ స్కూల్ వరకు రోడ్డు పనులు ప్రారంభం కావడంతో పనులు చేపడుతున్న హర్షవర్ధన్ రెడ్డిని రైతులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు కొన్ని ఏండ్లుగా పంట పొలాలకు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని ప్రస్తుత రోడ్డు నిర్మాణముతో బాధలు తప్పను ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం





నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు ప్రాథమిక పాఠ శాలలో శుక్రవారం స్వయం పరిపా లన దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. విద్యార్థులే ఉపాధ్యా యులై తోటి విద్యార్థులకు బోధిం చారు. ప్రధానోపాధ్యాయులు గా జి.హారిక, ఎంఈ ఓగా సాయి గణేష్, డీఈవోగా రహమాన్‌తో పాటు పలువురు విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ తగిరెడ్డి దేశి రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు రామస్వామి గౌడ్‌లు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు పద్మావతి , ఉపాధ్యా యులు లింగాల యాదయ్య, కల్లాటి శ్రీనివాస్, అల్లూరి మ హేందర్ రెడ్డి, గోవిందారం వెంకటేశ్,బట్ట బాలకిషన్, సీఆర్పీలు పెంట య్య, మోహన్ బాబు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యా ర్థులకు పాఠాలు బోధించి ఒక్కరోజు ఉపాధ్యాయు లుగా అనుభవం పొందారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యా ర్థులు జిల్లా విద్యాశాఖ అధికారిగా ప్రమోద్, మండల విద్యాశాఖ అధికారిగా రుచిత, పాఠశాల ప్రధానోపాధ్యా యులుగా హాసి ని విధులు నిర్వహించారు. ఈ సంద ర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మాట్లాడు తూ విద్యార్థులు స్వయం అనుభవం క్రమశిక్షణ అలవాటు పడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు శ్రీనివాస్, స్వామి, నరసింహులు, రేణుక విద్యార్థు లు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి ఆయా తరగతుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. శుక్రవారం మండలంలోని గుడి కందుల ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు వైష్ణవి ఆధ్వర్యం లో 20 మంది



విద్యార్థులు ఉపాధ్యాయులుగా, జిల్లా అధి కారుల పాత్రను నిర్వర్తించారు. డీఈఓగా సిద్దార్థ, పీఈటీలుగా శేఖర్, అజయ్, అటెండర్‌గా చందు వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా శృతి, ప్రవళిక, స్రవం తి, శ్వేత, అక్షయ, దినేష్, శివతేజ, అఖిల్, హర్షవర్ధన్‌లు వ్యవహరించారు. చక్కని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రోత్సాహకంగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు అంజిరెడ్డి ఉపాధ్యాయులు సోమ గారి నాగిరె డ్డి, తదితరులు ఉన్నారు.

మాత శిశు కేంద్రానికి పోస్ట్ సర్జికల్ వార్డు మంజూరు

సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి

నవతెలంగాణ జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మాతా శిశు సంక్షేమ వైద్యశాలలో మాత,శిశువు సంరక్షణ వైద్య ఆరోగ్య ఆసుపత్రికి 40 పడకల సిజేరియన్ పోస్ట్ సర్జికల్ వార్డు మంజూరు అయ్యిందని తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా. సిద్దం.ఉజ్వల్ రెడ్డిలు తెలిపారు. శుక్రవారం వారు పాత్రికేయలతో మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మాత,శిశువు సంరక్షణ వైద్య ఆరోగ్య ఆసుపత్రి నిర్మాణ పనులను తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా.సిద్దం.ఉజ్వల్ రెడ్డిలు ఇటీవలే పరిశీలించారు. ఇదిలా ఉండగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు శ్రీధర్, కిరణ్మాయిలు మాత, శిశువు సంరక్షణ వైద్య ఆరోగ్య ఆసుపత్రికి 40 పడకల సిజేరియన్ పోస్ట్ సర్జికల్ వార్డు మంజూరుకు కృషి చేయాలని కోరగా వారు స్పందించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి 40 పడకల సిజేరియన్ పోస్ట్ సర్జికల్ వార్డు మంజూరు చేశారు. దీంతో స్థానిక వైద్యులు హర్షం వ్యక్తం చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సీనియర్



నాయకులు డా.ఉజ్వల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ విజ్ఞప్తిని వెంటనే పరిశీలించి 40 పడకల పోస్టు సర్జికల్ వార్డు మంజూరు చేసిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోద రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్మీ ఉద్యోగం పొందిన విజయ్ కుమార్‌కు సన్మానం

నవతెలంగాణ- కల్హేర్

ఇటీవల వెలువడిన ఆర్మీ ఉద్యోగ ఫలితాలలో ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం పొందిన బేగరి విజయ్ కుమార్‌ను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీనూరి సాయిలు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఎర్ర ప్రవీణ్ కుమార్ లు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా సన్మానించారు. కల్హేర్ మండలంలోని మీరాన్ పేట గ్రామానికి చెందిన బేగరి రవాన్ లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు బేగరి విజయకుమార్ ఇటీవల వెలువడిన ఆర్మీ ఉద్యోగ ఫలితాలలో ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం పొందిన సందర్భంగా విజయ్ కుమార్ తల్లిదండ్రులు బేగరీ రావణ్ లక్ష్మీ దంపతులు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు సీనూరి సాయిలు ,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఎర్ర ప్రవీణ్ కుమార్, ఎర్ర రవాన్, కారంగుల పేతురులతో కలిసి శాలువాతో సన్మానించి పుష్ప గుచ్చం అందజేసి అభినందించి, శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బేగరీ జాన్, సీనూరి నతానియేల్, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు, పాల్గొన్నారు.



ప్రజా పాలనతో సమస్యల పరిష్కారం

ఇంచార్జ్ ఏపీఎం రాములుతో నవతెలంగాణ ముఖాముఖి

నవతెలంగాణ-నిజాంపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటిన సందర్భంగా ప్రజా పాలనలో భాగంగా మండల ఇంచార్జ్ ఏపీఎం రాములుతో నవ తెలంగాణ ముఖాముఖి

నవతెలంగాణ: ప్రజా పాలనలో భాగంగా మండలంలో ఎన్ని మహిళా గ్రూపులకు అప్పులు ఇవ్వడం జరిగింది?

ఇంచార్జ్ ఏపిఎం రాములు: మండలంలో 301 గ్రూపులకు రూ.23.58,82,000లు శ్రీనిధి కింద రూ.1.60 కోట్ల అప్పులు ఇవ్వడం జరిగింది.

నవతెలంగాణ: ఎంతమంది చిరు వ్యాపారులకు లోన్లు ఇచ్చారు?

ఇంచార్జ్ ఏపీఎం రాములు: 294 మంది చిరు వ్యాపారులకు అప్పులు ఇవ్వడం జరిగింది.

నవతెలంగాణ : ఎంతమందికి వ్యవసాయ పనిముట్లు అద్దెకు ఇవ్వడం జరిగింది?

ఇంచార్జ్ ఏపిఎం : 35 మందికి ఇవ్వడం జరిగిందని, బ్రష్ కట్టర్, పవర్ స్ప్రే , రూటువేటర్, రైతులకు అద్దెకు ఇవ్వడం జరుగుతుందన్నారు.

నవతెలంగాణ: నా మొక్క నా బాధ్యత కింద ఎన్ని మొక్కలు పంపిణీ చేశారు?

ఇంచార్జ్ ఏపిఎం : మామిడి మొక్కలు 220 మందికి, ఒక్కరికి ఒక్కొక్క మొక్క చొప్పున కే వెంకటాపూర్,



నందగోకుల్‌లో 180 మొక్కలు పంపిణీ చేయడం జరిగింది.

నవతెలంగాణ: నందగోకుల్ గ్రామంలో మదర్ యూనిట్ కింద ఎన్ని కోళ్లు ఇవ్వడం జరిగింది?

ఇంచార్జ్ ఏపిఎం : 1600 కోడి పిల్లలు ఇవ్వడం జరిగింది

నవతెలంగాణ: పెరటి కోళ్లు ఎన్ని ఇచ్చారు?

ఇంచార్జ్ ఏపిఎం: 1250 కోళ్లను ఇవ్వడం జరిగింది.

నవతెలంగాణ: మండలంలో స్కూల్ యూనిఫామ్‌లు ఎన్ని పంపిణీ చేశారు?

ఇంచార్జ్ ఏపిఎం: మండలంలో మొత్తం 2077 యూనిఫామ్ జతలను ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు బాల బాలికలకు పంపిణీ చేయడం జరిగింది.